మనకు లభించే చిన్న అవకాశాలే భవిష్యత్తులో ఉన్నత శిఖరాల్ని చేరుస్తాయి
– బెంజమిన్ ఫ్రాంక్లిన్

Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 240 | శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ఏఐ అందరికీ ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలి

- ఇది మానవ చరిత్ర పరివర్తనలో భాగం : ప్రధాని మోడీ
- ఏఐ భవిష్యత్తు కీలుబొమ్మలా మారదు : యూఎన్‌సెక్రెటరీ జనరల్



2వ

## మంచి ఫలితాలు సాధించారు

- రేవంత్ రెడ్డి సహా తెలంగాణ నేతలకు ఖర్గే, రాహుల్ గాంధీ ప్రశంసలు
- ఢిల్లీలోని ఖర్గే నివాసంలో సమావేశమైన తెలంగాణ కాంగ్రెస్ నాయకులు
- భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు తెలిపిన మల్లికార్జున ఖర్గే
- సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటన



2వ



## ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు అసహనం..

- ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని మండిపాటు!
- అందరికీ ఉచిత విద్యుత్తును ప్రకటించిన స్టాలిన్ ప్రభుత్వం
- రాష్ట్ర ఆర్థిక స్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్ ఎలా ఇస్తారన్న సుప్రీం
- ఉచితాల వల్ల దేశ అభివృద్ధి దెబ్బతింటుందని వ్యాఖ్య

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న ఉచిత పథకాలు దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకమవుతాయని సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్తు ఇవ్వడం కన్నా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి సారించాలని సూచించింది. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వ ఉచిత విద్యుత్తు ప్రకటనపై సర్వోన్నత న్యాయస్థానం సీరియస్‌గా స్పందించింది. వినియోగదారుల ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అందరికీ ఉచిత విద్యుత్ అందించేలా తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## త్వరలో ‘ఎస్ఐఆర్’...

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఈసీ లేఖ
- బీహార్‌లో ఇప్పటికే పూర్తయిన ‘ఎస్ఐఆర్’ ప్రక్రియ
- ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం సన్నాహకాలను త్వరగా పూర్తి చేయాలన్న ఈసీ
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లకు ఈసీ లేఖ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సిద్ధంగా ఉండాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 22 రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ రాసింది. బీహార్, పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో అమలు చేసిన ‘ఎస్ఐఆర్’ ప్రక్రియను దేశవ్యాప్తంగా చేపట్టేందుకు ఈసీ కసరత్తు చేస్తోంది. వీటికి సంబంధించిన సన్నాహకాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈసీ సూచించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలీ,

- మిగతా 2లో..





## నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు..

- ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ఒప్పందాలు!
- ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- ఐబీఎం, ఐఐటీ మద్రాస్, ఎన్విడియా వంటి దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు
- 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీలో నైపుణ్య శిక్షణ
- కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్న సీఎం చంద్రబాబు

అమరావతి - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కీలక పర్యటన చేపట్టనున్నారు. నేడు ఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న ‘ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026’లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో ఏఐ ఆధారిత అభివృద్ధికి, యువతకు నైపుణ్య శిక్షణకు మార్గం సుగమం చేసేలా పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంఓయూలు) చేసుకోనున్నారు. ఈ సదస్సులో భాగంగా ఏపీ ప్రభుత్వం పలు చరిత్రాత్మక ఒప్పందాలకు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి భవిష్యత్ సాంకేతికతల్లో నైపుణ్యాలు కల్పించేందుకు దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం



కుదుర్చుకోనుంది. అలాగే, ఏఐ, క్వాంటం టెక్నాలజీలలో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు యూనిసీసీ సంస్థతో కలిసి ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ సంస్థతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ కోసం ఐఐటీ మద్రాస్‌తోనూ ప్రభుత్వం ఎం

- మిగతా 8లో..



## ఇది బాబు భజన.. అన్నీ తప్పుడు లెక్కలే

- ఏపీ బడ్జెట్ అబద్ధాలు, తప్పుడు లెక్కలమయం అని జగన్ విమర్శ
- సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని ప్రభుత్వంపై ఆరోపణ
- రాష్ట్ర ఆదాయం బాబు అండ్ కో జేబుల్లోకి వెళుతోందని ఘాటు వ్యాఖ్యలు
- సొంత ఆదాయాల వృద్ధిలో ఏపీ 22వ స్థానంలో ఉందని వెల్లడి
- నారా లోకేశ్ పైనా తీవ్ర స్థాయిలో జగన్ ధ్వజం

8వ

## 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

- 28న బడ్జెట్
- 23వ తేదీన మంత్రివర్గ సమావేశం
- 10 నుంచి 15 రోజుల పాటు బడ్జెట్ సమావేశాలు
- మొదటి రోజు గవర్నర్ ప్రసంగం



### రాహుల్ గాంధీని కాల్చిపడేస్తానన్న వ్యక్తి అరెస్ట్

### సీఏఏపై సుప్రీంకోర్టు తుది విచారణ

2వ

# మంచి ఫలితాలు సాధించారు

**హైదరాబాద్ – సూర్య వాస్తవం**

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించారంటూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, తెలంగాణ కాంగ్రెస్ నాయకులను అభినందించారు. ఢిల్లీలోని ఖర్గే నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, నామా నాగేశ్వరరావు ఆయనను కలిశారు. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ కూడా ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నట్లు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఫలితాలపై రాహుల్ గాంధీ, ఖర్గే అభినందించారు.

ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై చర్చించామని అన్నారు. తెలంగాణకు పార్టీ ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలుచేస్తామని స్పష్టం చేశారు. సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణానికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. ప్రజా తెలంగాణ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్లే దిశగా కార్యాచరణను రూపొందించినట్లు తెలిపారు.

# త్వరలో 'ఎస్ఐఆర్'...

(మొదటి పేజీ తరువాయి)

డామన్ దయ్యూ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, జార్ఖండ్, కర్ణాటక, లడఖ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఢిల్లీ, ఒడిశా, పంజాబ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లకు ఎన్నికల సంఘం లేఖ రాసింది. ఏప్రిల్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశముంది. దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్' ప్రక్రియను చేపట్టాలని గత ఏడాది జూన్ నెలలో నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బీహార్‌లో ఈ ప్రక్రియ పూర్తయింది. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రక్రియ కొనసాగుతోంది. అసోంలో మాత్రం 'ఎస్ఐఆర్'కు బదులు ప్రత్యేక సవరణ పేరుతో ఓటరు జాబితా సవరణను పూర్తి చేశారు.

# నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు..

ప్రముఖ టెక్ సంస్థ ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై కూడా ఈ సదస్సులో కీలక ప్రకటన చేయనున్నారు. నేడు ఉదయం 9:30 గంటలకు జరిగే ప్లీనరీ సెషన్‌లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో కలిసి చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, డబ్ల్యూఈఎఫ్ సీఈఓ బోర్కే బ్రెండేతో కలిసి కృత్రిమ మేధస్సు అంశంపై చర్చిస్తారు. ఈ పర్యటనలో భాగంగా యునైటెడ్ కింగ్‌డమ్ ప్రతినిధి బృందంతో పాటు అరామ్కో, అడోబ్, ఆటోడెస్క్ వంటి కంపెనీల అధిపతులతోనూ ముఖ్యమంత్రి విడివిడిగా సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంపై చర్చలు జరుపుతారు.

## ఉచిత పథకాలపై
# సుప్రీంకోర్టు అసహనం..

(మొదటి పేజీ తరువాయి)

లిమిటెడ్ ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో డీఎంకే ప్రభుత్వంపై దాఖలైన పిటిషన్ ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్తును ఎలా అందిస్తారని ప్రశ్నించింది. చాలా రాష్ట్రాల్లో రెవెన్యూ లోటు పెరుగుతోందని... అయినప్పటికే ఉచిత పథకాల పంపిణీ జరుగుతోందని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి ఉచిత పథకాల వల్ల దేశ అభివృద్ధికి విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. సంక్షేమ పథకాల్లో భాగంగా కరెంట్ బిల్లులు చెల్లించలేని వారికి ఉచిత విద్యుత్ అందిస్తామంటే ఒక అర్థం ఉంటుందని... కానీ, మీరు ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని చెబుతున్నారని అసహనం వ్యక్తం చేసింది. ఆహారం, విద్యుత్ ఇలా అన్నీ ఫ్రీగా ఇస్తూ... మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని ప్రశ్నించింది.

ఎన్నికలకు ముందే రాష్ట్రాలు ఇలాంటి ఉచిత పథకాలను ఎందుకు తీసుకొస్తున్నాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల సమయంలో అన్నీ ఉచితంగా ఇచ్చుకుంటూ పోతే... అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా కూడా మిగలదని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## 26 నుంచి తెలంగాణ
# బడ్జెట్ సమావేశాలు

**- 28న బడ్జెట్ - 23వ తేదీన మంత్రివర్గ సమావేశం**

**- 10 నుంచి 15 రోజుల పాటు బడ్జెట్ సమావేశాలు**

**- మొదటి రోజు గవర్నర్ ప్రసంగం**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

త్వరలో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 28వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 23వ తేదీన మంత్రివర్గ సమావేశం అనంతరం బడ్జెట్ సమావేశాల తేదీని ప్రకటించనున్నారు. పది నుంచి పదిహేను రోజుల పాటు బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా మంత్రులు, అధికారులతో సమావేశమై ప్రతిపాదనలను స్వీకరించారు.

# ఏఐ అందరికీ ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలి

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

కృత్రిమ మేథ (ఏఐ) అందరికీ ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలని ప్రధాని మోడీ అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సమ్మిట్‌లో గురువారం మోడీ మాట్లాడుతూ.. 'ప్రపంచంలోని అత్యంత చారిత్రాత్మక ఏఐ సమ్మిట్‌కు మీ అందరికీ నా స్వాగతం. ప్రపంచంలోనే అతిపెద్ద టెక్ పూల్‌కు భారతదేశం కేంద్రం. భారత్‌లో ఏఐ సమ్మిట్ నిర్వహించడం గ్లోబల్ సౌత్‌కు గర్వకారణం. సిగ్నల్స్‌ను మొదట వైర్‌లెస్‌గా ప్రసారం చేసినప్పుడు ఒకరోజు మొత్తం ప్రపంచం రియల్ టైమ్‌కి అనుసంధానించబడి ఉంటుందని ఎవరూ ఊహించలేదు. కృత్రిమ మేథస్సు అనేది మానవ చరిత్ర యొక్క ఒక పరవర్తన. ఈరోజు మనం చూస్తున్నది, మనం అంచనా వేస్తున్నది దాని ప్రభావానికి ప్రారంభం మాత్రమే అని ఆయన అన్నారు. భారత్ ఏఐని ప్రయోజనకర రీతిలో చూస్తుంది. అందుకే మేము 'సర్వజన్ హితయే, సర్వజన్ సుఖయే'ను థీమ్‌గా ఎంచుకున్నాం. అందరికీ, ముఖ్యంగా గ్లోబల్ సౌత్‌కు ప్రజాస్వామ్యబద్ధగా ఉండటానికి మనకు ఏఐ అవసరం అని అన్నారు. అలాగే ఏఐ యంత్రాలను తెలివైనవిగా మారుస్తోంది. కానీ అంతకంటే ఎక్కువగా ఇది మానవ సామర్థ్యాలను అనేక రెట్లు పెంచుతోంది అని మోడీ అన్నారు. 'ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర'– సమ్మిట్‌లో యూఎన్ చీఫ్, టెక్ దిగ్గజాల ప్రసంగం

**ఏఐ భవిష్యత్‌ను కొందరు నిర్ణయించలేరు: యూఎన్ చీఫ్**

గ్లోబల్ సౌత్‌లో మొదటి ఏఐ సమ్మిట్‌ను నిర్వహిస్తున్న భారత్‌కు యూఎన్ సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ అభినందనలు తెలియజేశారు. భారత్‌లో జరిగే ఈ ఏఐ సమ్మిట్‌కు ప్రత్యేక అర్థం ఉందని చెప్పారు. ఏఐ భవిష్యత్తును కొన్ని దేశాలు లేదా కొంత మంది బిలియనీర్లు నిర్ణయించలేరని స్పష్టం చేశారు. నిజమైన ఇంపాక్ట్ అంటే జీవితాలను మెరుగుపరిచి, భూమిని రక్షించే సాంకేతికత అని అభిప్రాయపడ్డారు.

**దేశంలో మార్పుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నా : సుందర్ పిచాయ్**

తాను భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ దేశంలో మార్పుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నానని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు చెన్నై నుంచి ఐఐటీ ఖరగ్‌పూర్‌కు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ మీదుగా వెళ్లేవాడిని తెలిపారు. ఇప్పుడు తీరప్రాంత నగరమైన అదే విశాఖపట్నంలో గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. ఈ హబ్ గిగా వాట్ స్కేల్ కంప్యూటర్, కొత్త అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గేట్‌వేను కలిగి ఉంటుందని అన్నారు. దీని వల్ల యువతకు ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే భారత ప్రజలకు అత్యాధునిక ఏఐ అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

**ప్రతి పౌరుడికి ఏఐని అందించడమే లక్ష్యం : టాటా సన్స్ చైర్మెన్ చంద్రశేఖరన్**

ప్రజలపై ఏఐ చాలా బలమైన ప్రభావాన్ని చూపుతుందని టాటా సన్స్ చైర్మెన్ ఎన్ చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. సమాజంపై తీవ్ర ప్రభావం చూపే తదుపరి ప్రధాన మౌలిక సదుపాయం ఏఐయేనని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పౌరుడికి ఏఐ టూల్స్ అందేలా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోందన్నారు.

**ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి : ఆంత్రోపిక్ సీఈఓ**

ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ అభిప్రాయపడ్డారు. గత రెండున్నరేళ్లలో ఏఐ రంగంలో భారత్ మంచి పురోగతి సాధించిందని పేర్కొన్నారు. అందుకే ఇటీవల వారంలో బెంగళూరులో తాము ఒక కార్యాలయాన్ని ప్రారంభించామని గుర్తు చేసుకున్నారు.

**118 దేశాలు హాజరు**

గ్లోబల్ సౌత్‌లో మొదటిసారి జరుగుతున్న ఏఐ సమ్మిట్‌లో 118 దేశాలు పాల్గొన్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రపంచంలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద ఏఐ సదస్సు ఇదేనని పేర్కొన్నారు. ఈ సమ్మిట్‌ను విజయవంతం చేసిన దేశాధినేతలు, నాయకులు, టెక్ నిపుణులకు ధన్యవాదాలు వెల్లడించారు.

# ఇది బాబు భజన.. అన్నీ తప్పుడు లెక్కలే

**అమరావతి – సూర్య వాస్తవం**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల బడ్జెట్ కాదని, కేవలం చంద్రబాబు భజన, తప్పుడు లెక్కలతో నిండిన మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు. "మోసానికి షర్టు, ప్యాంటు వేస్తే అది చంద్రబాబే. అబద్ధానికి రెక్కలు కడితే అది కూడా చంద్రబాబే" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలతో ప్రసంగాన్ని ప్రారంభించారు. చంద్రబాబు పాలన "పబ్లిసిటీ పీక్.. పర్ఫామెన్స్ వీక్" అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను మూడు బడ్జెట్‌ల లోనూ గాలికి వదిలేసి అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక లెక్కలన్నీ తప్పుల తడకలేనని జగన్ అంకెలతో సహా వివరించారు. 2024-25లో రూ.1.19 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పి, వాస్తవానికి రూ.94,937 కోట్లు మాత్రమే రాబట్టారని తెలిపారు. పది నెలల్లో రాష్ట్ర ఆదాయ వృద్ధి కేవలం 4.25 శాతమేనని పేర్కొన్నారు. కాగ్ రిపోర్ట్ ప్రకారం, దేశంలోని 23 రాష్ట్రాల్లో సొంత ఆదాయాల పురోగతిలో ఏపీ చివరి నుంచి రెండో స్థానంలో (22వ ర్యాంక్) ఉందని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో 2026-27 నాటికి ఆదాయం 45% పెరుగుతుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్ర ఆదాయం 'బాబు అండ్ కో' జేబుల్లోకి వెళ్తోందని, "దోచుకో.. దాచుకో.. పంచుకో" అనే విధానం అమలవుతోందని జగన్ ఆరోపించారు. అప్పుల వివరాలను బడ్జెట్‌లో చూపించకపోవడం పారదర్శకత లేకపోవడానికి నిదర్శనమన్నారు. మహిళలకు రూ.1,500, నిరుద్యోగ భృతి వంటి హామీలకు నిధుల కేటాయింపు ఏదని ప్రశ్నించారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్‌ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల డబ్బుతో కొలంబో, ఢిల్లీ అంటూ విమానాల్లో తిరుగుతూ క్రికెట్ మ్యాచ్ లు చూస్తూ, స్టేడియాల్లో జల్సాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. "రాత్రికి కొలంబోలో ఉంటాడు, మరుసటి రోజు ఉదయం విజయవాడలో ఉంటాడు... సాయంత్రానికి ఢిల్లీ వెళతాడు... అంతా ప్రైవేటు విమానాలే. దేశంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇలా జల్సాలు చేయడం ఎక్కడైనా ఉందా? చంద్రబాబుకు ఒక విమానం, లోకేశ్ కు ఒక విమానం, పవన్ కల్యాణ్ కు ఓ విమానం... అందరూ గాల్లోనే ఉంటారు. క్రికెట్ మ్యాచ్ చూడాలంటే కొలంబోనే వెళ్లాలా... టీవీలో చూస్తే కనపడదా... నేను కూడా టీవీలోనే చూశాను" అంటూ జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

# రాహుల్ గాంధీని కాల్చిపడేస్తానన్న వ్యక్తి అరెస్ట్

**- రాహుల్ గాంధీకి హత్య బెదిరింపులు.. రాజస్థాన్‌లో కలకలం**

**- వీడియో వైరల్ కావడంతో కర్ణిసేన కార్యకర్తగా భావిస్తున్న వ్యక్తి అరెస్ట్**

**- ఇదంతా కుట్ర, తన పేరుతో ఫేక్ ఐడీ సృష్టించారన్న నిందితుడు**

**- ఇది గోడ్సే మనస్తత్వం అంటూ బీజేపీ, ఆరెస్సెస్‌పై కాంగ్రెస్ ఫైర్**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి హత్య బెదిరింపులు జారీ చేసిన ఓ వ్యక్తిని రాజస్థాన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కర్ణిసేనకు చెందిన వ్యక్తిగా భావిస్తున్న రాజా అమేరా ఈ బెదిరింపులకు పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో కోటా పోలీసులు రంగంలోకి దిగారు. నిందితుడు బెదిరింపులకు పాల్పడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పట్ల 25 మంది ప్రతిపక్ష ఎంపీలు అనుచితంగా ప్రవర్తించారని, దీనికి రాహుల్ గాంధీయే బాధ్యుడని ఆ వీడియోలో యువకుడు ఆరోపించాడు. ఇలాంటి ఘటన పునరావృతమైతే సంబంధిత ఎంపీల ఇళ్లను ధ్వంసం చేస్తామని, రాహుల్ గాంధీని ఆయన నివాసంలోనే కాల్చి చంపుతామని తీవ్రస్థాయిలో హెచ్చరించాడు. ఈ పని చేసినందుకు జైలుకు వెళ్లడానికైనా సిద్ధమేనని సవాల్ విసిరాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు వెంటనే స్పందించి, రాజా అమేరాను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. అయితే, పోలీసుల విచారణలో రాజా అమేరా తనపై వచ్చిన ఆరోపణలను ఖండించాడు. ఆ వీడియో గురించి తనకు ఏమీ తెలియదని, ప్రత్యర్థులు తన పేరుతో ఫేక్ ఐడీ సృష్టించి ఈ కుట్ర పన్నారని ఆరోపించాడు. తాను సనాతన హిందువునని, భారత్‌ను హిందూ దేశంగా చూడాలనుకుంటున్నానని చెప్పాడు. ఈ ఘటనపై రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్ గోవింద్ సింగ్ దోతసారా తీవ్రంగా స్పందించారు. రాహుల్ గాంధీని బహిరంగంగా చంపేస్తామని బెదిరిస్తున్నారని, ఇది నాథూరాం గాడ్సేను తయారు చేసిన విషపూరిత మనస్తత్వానికి నిదర్శనమని విమర్శించారు. భేదాభిప్రాయాలను 'దేశ వ్యతిరేకం'గా చిత్రీకరించి, హింసకు అనుకూలమైన వాతావరణాన్ని బీజేపీ–ఆరెస్సెస్ సృష్టిస్తున్నాయని ఆయన ఆరోపించారు.



# సీఏఏపై సుప్రీంకోర్టు తుది విచారణ

**- మే 5 నుంచి ప్రారంభం..**

**చట్టం చెల్లుబాటుపై 250కి పైగా పిటిషన్లు**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), దాని నియమావళిపై దాఖలైన 250కి పైగా పిటిషన్ల తుది విచారణను సుప్రీంకోర్టు చేపట్టనున్నది. మే 5 నుంచి విచారణను ప్రారంభించాలని సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్.. మే 5 నుంచి మే 7 వరకు వరుసగా మూడురోజులు వాదనలు విని, ఆ తర్వాత మే 12న రిజాయిండర్ వాదనలు స్వీకరించి తీర్పును రిజర్వ్ చేయనున్నది.

**ఏమిటీ వివాదం?**

సీఏఏ–2019 ప్రకారం ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల నుంచి 2014 డిసెంబర్ 31కి ముందు భారత్‌లోకి వచ్చిన హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతాలకు చెందిన వలసదారులకు పౌరతసత్వం కల్పించే నిబంధనలు ఉన్నాయి. ముస్లింలను ఈ జాబితా నుంచి మినహాయించడంపై పలువురు రాజ్యాంగ విరుద్ధమని వాదిస్తున్నారు. ఈ చట్టం మతం ఆధారంగా వివక్ష చూపుతోందని పిటిషనర్ల వాదన. రాజ్యాంగంలోని సమానత్వ హక్కు, లౌకికత సూత్రాలను ఉల్లంఘిస్తోందని వారు అంటున్నారు.

# సంపాదకీయం

## డిజిటల్ ఇండియా చట్టం....





ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వినియోగం పెనుసవాలుగా మారుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. మైనర్లు లేదా చిన్న పిల్లలు సోషల్ మీడియాకు బానిసలవుతు న్నారనే ఆందోళనల నేపథ్యంలో వయస్సు ఆధారిత పరిమితులు విధించే అంశంపై ప్రభుత్వం తీవ్రంగా చర్చిస్తోంది. ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. పిల్లల మానసిక ఆరోగ్యం, ఆన్‌లైన్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు ఆయన సూచించారు. సోషల్ మీడియా వేదికలు యువతపై చూపిస్తున్న ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఆస్ట్రేలి యా వంటి దేశాలు ఇప్పటికే 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించే దిశగా చట్టాలు చేశాయి. భారత్‌లో కూడా ఇటువంటి నిబంధనలు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. "పిల్లల భద్రత విషయంలో మేము రాజీ పడము. సోషల్ మీడియా వాడకానికి కనీస వయస్సు ఎంత ఉండాలనే దానిపై వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నాము. దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు కానీ, లోతైన చర్చలు మాత్రం జరుగుతున్నాయి" అని స్పష్టం చేశారు. చిన్న వయస్సులోనే సోషల్ మీడియాకు అలవాటు పడటం వల్ల పిల్లల్లో ఏకాగ్రత తగ్గడం, నిద్రలేమి, సైబర్ బుల్లింగ్ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా అశ్లీల కంటెంట్ లేదా హానికర మైన గేమింగ్ యాప్‌లు పిల్లల దారి మళ్లిస్తున్నాయని తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్లు నిండిన వారు ఖాతా తెరవవచ్చని చెబుతున్నప్పటికీ, వయస్సును ధృవీకరించే బలమైన వ్యవస్థలు లేవు. దీనివల్ల పదేళ్ల లోపు పిల్లలు కూడా తప్పుడు వివరాలతో లాగిన్ అవుతున్నారు. ప్రభుత్వం తీసుకురాబోయే కొత్త నిబంధనల వల్ల 'ఏజ్ వెరిఫికేషన్' ప్రక్రియ మరింత కఠినతరం కానుంది. అమెరికా, యూరోపియన్ దేశాల్లో కూడా సోషల్ మీడియా (సంస్థలపై కఠినమైన నిబంధనలు విధిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి ప్లాట్ ఫారమ్‌లు పిల్లల డేటాను ఎలా సేకరిస్తున్నాయి? వారికి ఎటువంటి కంటెంట్‌ను చూపిస్తు న్నాయి? అనే దానిపై నిఘా పెరిగింది. భారత్ కూడా ఇప్పుడు అదే బాటలో పయనిస్తోంది. ప్రతిపాదిత 'డిజిటల్ ఇండియా చట్టం' లో భాగంగా సోషల్ మీడియా సంస్థలకు జవాబు దారీతనాన్ని పెంచాలని కేంద్రం యోచిస్తోంది. ప్రభుత్వం కేవలం నిషేధాలకే పరిమితం కాకుండా, డిజిటల్ అక్షరాస్యతను పెంచడంపై కూడా దృష్టి సారిస్తోంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు తమ అల్గారిథమ్‌లను మార్చుకోవాలని, పిల్లలకు హాని కలిగించే కంటెంట్ రాకుండా చూడాలని మంత్రి సూచించారు. ఒకవేళ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధించే అవకాశం కూడా ఉంది. అయితే ఈ ప్రక్రియలో ఇంటర్నెట్ స్వేచ్ఛకు, గోప్యతకు భంగం కలగకుండా చూడటం కూడా ప్రభుత్వానికి ఒక సవాలుగా మారింది. మొత్తానికి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియా ప్రపంచంలో కలకలం రేపుతున్నాయి. డిజిటల్ ఇండియా చట్టం భారతదేశం నుండి దాని మొత్తం చరిత్రలో వెలువడే అత్యంత ముఖ్యమైన ఐటీ చట్టం అవుతుంది మరియు రాబోయే దశాబ్దం లేదా రెండు దశాబ్దాల పాటు మొత్తం దేశం డిజిటల్ చట్టాలను సమర్థ వంతంగా నియంత్రిస్తుంది. ఈ కొత్త చట్టంతో, దేశం తన డిజిటల్ చట్టాలను భవిష్యత్తుకు అనుగుణంగా మార్చుకోవాలని, వ్యాపారాలు ప్రపంచ స్థాయిలో పోటీ పడటానికి వీలు కల్పించాలని ఆశిస్తోంది. అదనంగా, డిజిటల్ ఇండియా చట్టం యొక్క ముసాయిదా రూపకల్పనలో అనేక మంది వాటాదారులను (పౌరులను) పాల్గొనడానికి మరియు సంప్రదించడానికి భారత ప్రభుత్వం ప్రయత్నించింది, దీని నియమాలు మరియు చట్రం కనీసం వచ్చే దశాబ్దం పాటు దేశంలో సమగ్ర ఐటీ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసేలా చూసుకోవాలి. అయితే, అంతిమ లక్ష్యం పౌరుల గోప్యతా హక్కుల కోసం బలమైన చట్టాలను నిర్ధారించడం మరియు ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంపొందించడం మాత్రమే కాదు - డిజిటల్ ఇండియా చట్టం భారతీయ వ్యాపారాలకు డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించ డానికి, ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా దేశాన్ని ప్రపంచవ్యాప్త డిజిటల్ పవర్‌హౌస్‌గా మార్చడానికి రూపొందించబడింది. డిజిటల్ ఇండియా చట్టం చుట్టూ కేంద్రీకృతమై, భారతదేశం 2026 నాటికి ట్రిలియన్ డాలర్ల డిజిటల్ ఆర్థిక వ్యవస్థను సాధించగలదని చంద్రశేఖర్ విశ్వసిస్తున్నారు. భారత పార్లమెంటు నవంబర్ 2022లో ప్రతిపాదించబడిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, 2022తో పాటు డిజిటల్ ఇండియా చట్టాన్ని అమలు చేయాలని యోచిస్తోంది. ఈ రెండు చట్టాలు ఒకదానికొకటి కలిసి పనిచేస్తాయి, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు భారతదేశంలో వ్యక్తిగత డేటాను ప్రాసెస్ చేయడంపై మాత్రమే దృష్టి సారిస్తుంది. 2000 నాటి ఐటీ చట్టం చాలా కాలం చెల్లినది మరియు దాని ప్రారంభంలో "ఇంటర్నెట్" గురించి దాదాపుగా ప్రస్తావించ బడలేదు. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక ఇంటర్నెట్ కనెక్షన్ ఉన్న దేశం అనే స్థాయికి చేరుకుంటున్నందున, కానీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు మాత్రమే నిర్వచించబడిన నియమాలు ఉన్నాయి. సమాచార భాగస్వామ్యాన్ని సులభతరం చేసే లేదా ఆన్‌లైన్ సేవలను అందించే ఏదైనా కంపెనీ లేదా ప్లాట్‌ఫారమ్‌ను మధ్యవర్తులు అంటారు. ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లను "స్వచ్ఛమైన మధ్యవర్తులు"గా వర్గీకరించారు, కలిసి సమూహం చేశారు. మూడవ పక్షాల నుండి ఉద్దేశపూర్వక తప్పుడు సమాచారం లేదా ఇతర కంటెంట్ ఉల్లంఘనలకు సంబంధించి ఆన్‌లైన్ మధ్యవర్తులకు "సేఫ్ హార్బర్" రోగనిరోధక శక్తిని తొలగించడంగతంలో, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల వంటి ఆన్‌లైన్ మధ్యవర్తులకు "సేఫ్ హార్బర్" చట్టపరమైన రోగనిరోధక శక్తి ఇవ్వబడింది, వారి సంబంధిత ప్లాట్‌ఫారమ్‌లలో పోస్ట్ చేయబడిన మూడవ పక్ష కంటెంట్‌పై వారికి ఎటువంటి నియంత్రణ లేనందున వాటిని సమర్థవంతంగా రక్షించింది. అయితే, మధ్యవర్తులకు రోగనిరోధక శక్తి ఇవ్వబడినందున, వారికి మూడవ పక్ష కంటెంట్ నియంత్రణ లేదు, ఇది తరచుగా వాస్తవ తనిఖీ లేకపోవడం కంటెంట్ ఉల్లంఘనలను తొలగించకపోవడానికి దారితీస్తుంది. డిజిటల్ ఇండియా చట్టం ప్రకారం, ప్రతి మధ్యవర్తి వర్గం కొత్త నిబంధనలకు లోబడి ఉంటుంది. డిజిటల్ ఇండియా చట్టం కింద సైబర్ బెదిరింపు, వంచన, గుర్తింపు దొంగతనం, మోసం, డాక్సింగ్, హానికరమైన అనధికార వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వంటి కొత్త రకాల సైబర్ నేరాలను కొత్త క్రిమినల్ నేరాలుగా వర్గీకరించాలని ఎలక్ట్రానిక్స్ ఐటీ మంత్రిత్వ శాఖ యోచిస్తోంది. గతంలో, ఈ నేరాలకు జరిమానాలు విధించేవారు, ఐటీ చట్టం ద్వారా నేరంగా పరిగణించబడలేదు. డిజిటల్ స్థలం (బిగ్ టెక్) గుత్తాధిపత్యాన్ని తొలగించడం, స్థానిక స్టార్టప్‌ల నుండి న్యాయమైన పోటీని, వినియోగదారు లకు మరిన్ని ఎంపికలను అనుమతించడం. పెద్ద యాడ్‌టెక్ కంపెనీలను నియంత్రించే ఇలాంటి సందర్భంలో, డిజిటల్ ఇండియాప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయం కోట్లాది మంది భారతీయ విద్యార్థులు, యువత భవిష్యత్తుపై ప్రభావం చూపనుంది. తల్లి దండ్రులు, విద్యావేత్తలు మాత్రం ఈ దిశగా ప్రభుత్వం అడుగులు వేయడాన్ని స్వాగతిస్తున్నారు.

# ఆధునిక ప్రజారోగ్య చట్టం

# దేశ సంక్షేమానికి అత్యవసరం

డా. యం. అఖిల మిత్ర, ప్రకృతి వైద్యులు






**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం:** ప్రజారోగ్యం అనేది సమాజం సంయుక్త కృషి ద్వారా వ్యాధులను నివారించడం, ఆయుష్షును పెంచడం, ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం అనే శాస్త్రం, కళగా విస్తృతంగా అర్థం చేసుకోబడింది. ప్రజారోగ్య చట్టం అనేది ప్రజలు ఆరోగ్యంగా జీవించేందుకు అవసరమైన పరిస్థితులను సృష్టించడానికి రాష్ట్రం, సమాజాలు మరియు సంస్థలతో కలిసి పనిచేసే అధికారాలు బాధ్యతలను నిర్వచి స్తుంది. అదే సమయంలో స్వేచ్ఛ, గోప్యత, ఆస్తి హక్కులు వంటి వ్యక్తిగత హక్కులను రక్షించేందుకు రాష్ట్ర అధికారాలకు పరిమితులను కూడా నిర్దేశిస్తుంది.

### ఆరోగ్య వ్యవస్థల కనిపించని వెన్నెముక

అమెరికన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్, సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్, పాన్ అమెరికన్ హెల్త్ ఆర్గనైజేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి సంస్థలు నిర్వచించిన ప్రజారోగ్య అవసర సేవలు ప్రపంచ వ్యాప్తంగా ప్రజారోగ్య బాధ్యతలకు రూపకల్పనను అందిస్తున్నాయి. వీటిలో వ్యాధి పర్యవేక్షణ, పారిశుద్ధ్యం, ఆహార భద్రత, సురక్షిత తాగునీరు, ఆరోగ్య ప్రోత్సాహం వంటి సేవలు ఉన్నాయి. ఇవి ప్రజలకు ఎక్కువగా కనిపించకపోయినా సమాజ సంక్షేమానికి అత్యంత అవసరం. ఈ వ్యవస్థలు విఫలమైతే నివారించగలిగే వ్యాధులు, మరణాలు పెరుగుతాయి. అయితే ఆరోగ్య ఫలితాలు కేవలం వైద్యరంగంపై మాత్రమే ఆధార పడవు. కాబట్టి సమర్థవంతమైన ప్రజారోగ్య పరిపాలన విభాగాల మధ్య సమన్వయం, నియంత్రణ, పర్యవేక్షణ మరియు అవగాహన అవసరం. ప్రజారోగ్యానికి చట్టం రెండు విధాలుగా మద్దతు ఇస్తుంది. "మౌలిక సదుపాయాల చట్టాలు" ప్రజారోగ్య సంస్థలను స్థాపించి, డేటా సేకరణ, తనిఖీలు, అనుమతులు మరియు జోక్యాలను అమలు చేయడానికి అధికారాన్ని ఇస్తాయి. "జోక్య చట్టాలు" పొగాకు వినియోగాన్ని మైనర్లకు నిషేధించడం, భద్రతా ప్రమాణాలను నిర్బంధించడం లేదా వ్యాధి ప్రబలినప్పుడు క్వారంటైన్ అమలు చేయడం వంటి ప్రత్యేక ప్రమాదాలను ఎదుర్కొంటాయి. భారతదేశంలో అత్యవసర పరిస్థితుల్లో ప్రతిస్పందన తరచుగా పాత చట్టపరమైన వ్యవస్థలు, శిక్షణ పొందిన ప్రజారోగ్య సిబ్బంది కొరత కారణంగా బలహీనమవుతోంది. చట్టాలు ఉన్నా వాటి అమలు లోపించడం వల్ల ఫలితాలు పరిమితమవుతున్నాయి.

### రాజ్యాంగ పునాదులు

భారత రాజ్యాంగం షెడ్యూల్ VII ప్రకారం యూనియన్, స్టేట్, కాన్కరెంట్ జాబితాల ద్వారా పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల మధ్య చట్ట నిర్మాణ అధికారాలను విభజించింది. ఆసుపత్రులు, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి అంశాలు ప్రధానంగా రాష్ట్ర జాబితాలో ఉన్నాయి. కాన్కరెంట్ జాబితాలో జనాభా నియంత్రణ, మానసిక ఆరోగ్యం, ఆహార భద్రత, సంక్రమణ వ్యాధుల నివారణ, కార్మిక సంక్షేమం వంటి అంశాలపై కేంద్రం, రాష్ట్రాలు రెండూ చట్టాలు చేయవచ్చు. విభేదం వచ్చినప్పుడు కేంద్ర చట్టం ప్రాధాన్యం పొందుతుంది. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా రాజ్యసభ అనుమతితో లేదా రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాల అభ్యర్థనపై పార్లమెంట్ రాష్ట్ర అంశాలపై కూడా చట్టం చేయవచ్చు. ఆర్టికల్స్ 14, 15, 21ల ద్వారా జీవన హక్కు, సమానత్వం, వివక్ష రహిత హక్కుతో ఆరోగ్య హక్కును న్యాయ వ్యాఖ్యానాలు అనుసంధానించారు. రాష్ట్ర పాలనా దిశానిర్దేశక సూత్రాలు పోషకాహారం, జీవన ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలని రాష్ట్రాన్ని ఆదేశిస్తాయి.

### విభిన్న చట్టాలు - పెరుగుతున్న సవాళ్లు


స్వాతంత్ర్యం తర్వాత ప్రజారోగ్య చట్టాలు ప్రధానంగా రాష్ట్రాల ద్వారా అమలులోకి వచ్చాయి. కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే ప్రత్యేక ప్రజారోగ్య చట్టాలు ఉన్నాయి; వాటిలో అనేకం దశాబ్దాల పాతవి. 1939లో రూపొందించిన తమిళనాడు ప్రజారోగ్య చట్టం అనేక సవరణలను ఎదుర్కొంది. కేంద్ర ప్రభుత్వం 1987 మోడల్ పబ్లిక్ హెల్త్ బిల్, 2002 నేషనల్ పబ్లిక్ హెల్త్ బిల్, 2009 నేషనల్ హెల్త్ బిల్ వంటి నమూనా చట్టాల ద్వారా ఏకరీతి సాధించడానికి ప్రయత్నించింది. ఇది పారిశుద్ధ్యం, నీటి సరఫరా, మార్కెట్లు, సంక్రమణ వ్యాధుల నియంత్రణ వంటి అంశాలను కవర్ చేస్తాయి. పాత చట్టాలు ప్రధానంగా బలవంతపు విధానాన్ని అనుసరించగా, కొత్త ముసాయిదాలు హక్కుల ఆధారిత విధానాన్ని ప్రోత్సహిస్తున్నాయి. అయినప్పటికీ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్, కొత్త సంక్రమణలు, పర్యావరణ హాని, వేగవంతమైన పట్టణీకరణ వంటి ఆధునిక సవాళ్లను ఎదుర్కోడానికి ప్రస్తుత చట్టాలు తగినవి కావు.

### బలవంతపు వర్సెస్ హక్కుల ఆధారిత విధానం

బలవంతపు విధానం ప్రజాస్వామ్య ప్రభుత్వానికి సమిష్టి సంక్షేమాన్ని రక్షించే బాధ్యత ఉందని భావిస్తుంది. కాలుష్యం, అసురక్షిత ఆహారం, సంక్రమణ వ్యాధులు వంటి సామూహిక ప్రమాదాలను నియంత్రించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు. హక్కుల ఆధారిత విధానం వ్యక్తిగత స్వేచ్ఛను ప్రాధాన్యంగా చూస్తుంది. ప్రజారోగ్య చర్యలు చట్టబద్ధంగా, అనుపాతంగా, మౌలిక హక్కులు గౌరవిస్తూ ఉండాలని ఇది నొక్కి చెబుతుంది. భారతదేశం ఒక కీలక దశలో ఉంది. జనాభా మార్పులు, పర్యావరణ ఒత్తిళ్లు, మారుతున్న వ్యాధి నమూనాలు ప్రజారోగ్యానికి బలమైన చట్టపరమైన పునాది అవసరాన్ని సూచిస్తున్నాయి. పాత చట్టాలను సవరించడం కంటే మౌలిక సదుపాయాలు, అత్యవసర సిద్ధత, బాధ్యతాయుత పరిపాలన మరియు హక్కుల రక్షణను సమగ్రంగా కలిపిన ఆధునిక ప్రజారోగ్య చట్టం అవసరం. సమాజ సంక్షేమం వ్యక్తిగత స్వేచ్ఛ మధ్య సమతౌల్యం సులభం కాదు. అయినప్పటికీ బలమైన మరియు ఆధునిక ప్రజారోగ్య చట్టం దేశ సంక్షేమానికి అత్యవసరం.

# ఐదువేల సంవత్సరాల తెలంగాణ సాంస్కృతిక వారసత్వం

- డా. జి. వెన్నెల గద్దర్, ఛైర్‌పర్సన్, తెలంగాణ సంస్కృతిక సారథి





**తెలంగాణ - సూర్య వాస్తవం:** దక్కన్ పీఠభూమి సాంస్కృతిక హృద యంగా పేరు గాంచిన తెలంగాణకు దాదాపు 5,000 సంవత్సరాల వార సత్వం ఉంది. కాకతీయ, కుతుబ్షాహీ ఆసఫ్ జాహీ వంశ పాలకుల ఆశ్ర యంతో ఈ ప్రాంతం కళలు, వాస్తు శిల్పం, వంట కాలు, సాహిత్యం వంటి రంగాల్లో విక సించింది. వారి పరిపాలనలో హిందూ-ఇస్లామీయ సంప్రదాయాలు సమన్వ యంగా సహజీవనం చేసిన ప్రత్యేక దక్కని సంస్కృతి రూపుదిద్దుకుంది. వరంగల్, కరీంనగర్ హైదరాబాద్ ఈ సాంస్కృతిక కేంద్రాలుగా నిలిచాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాదు "గంగా-జమునా తెహజీబ్" అనే సమ్మిళిత సంస్కృతికి ప్రతీకగా ప్రసిద్ధి చెందింది. 2019లో యునెస్కో హైదరాబాద్‌ను క్రియేటివ్ సిటీ ఆఫ్ గ్యాస్ట్రానమీగా గుర్తించింది. హైదరాబాద్ బిర్యానీ, కబాబ్, హలీమ్ వంటి వంటకాలు తెలుగు మరియు ఇండో-ఇస్లామిక్ ప్రభావాల సమ్మేళనాన్ని ప్రతిబింబిస్తాయి. రామప్ప దేవాలయం, వేయిస్తంభాల గుడి, వరంగల్ ఖిలా వంటి కాకతీయ యుగ వాస్తు శిల్ప కట్టడాలు ప్రాంత చారిత్రక వైభవాన్ని గుర్తుచేస్తాయి. తెలంగాణ పండుగలు రాష్ట్ర సమన్వయ భావాన్ని ప్రతిబింబిస్తాయి. బోనాలు మహంకాళి అమ్మవారికి అంకితం కాగా, బతుకమ్మ పూలతో స్త్రీత్వం ప్రకృతిని ఆరాధించే పండుగ. దసరా, ఉగాది, సంక్రాంతి, మిలాద్-ఉన్-నబీ, రంజాన్ పండుగలు సమాన ఉత్సాహంతో జరుపుకుంటారు. ఇది మతాలకు అతీతమైన సాంస్కృతిక ఐక్యతను బలపరుస్తాయి. తెలంగాణ వారసత్వానికి ప్రాణం తెలుగు జానపద సాహిత్యం. శతాబ్దాలుగా గ్రామీణ సమాజాలు కథలు, జానపద గీతాలు, పురాణాలను మౌఖిక సంప్రదాయం గా తరతరాలకు అందించాయి. సమాజ విలువలు, ఆశయాలు, తాత్విక భావనలు ఈ కథల్లో ప్రతిబింబి స్తాయి. సమాజ బంధాలను బలపరచిన ఈ కళా రూపాలు శుభఫలితాలను అందిస్తాయని విశ్వసించే వారు. రాష్ట్రంలో 160కు పైగా జానపద కళారూపాలు ఉన్నాయి. వారసత్వ కళాకార సముదాయాలు వీటిని కొనసాగించాయి. శివుని అవతారాలను కీర్తించే ఒగ్గు కథ, సంగీతంతో సామాజిక సందేశాలను అందించే బుర్రకథ, నృత్య ప్రధానమైన చిందు భాగవతం వంటి రూపాలు ఒకప్పుడు గ్రామీణ జీవితంలో వినోదం మరియు విద్యకు ముఖ్య సాధనాలుగా ఉండేది. గొల్లసుద్దులు, పేరిణి శివతాండవం, డప్పు నృత్యం, గుస్సాడి వంటి ఇతర కళారూపాలు కూడా విశేష ప్రాధాన్యం కలిగినవే. వీటిని ఊరి వేదికలపై, చిత్ర పటాలతో, సమూహ గానాలతో, నాట్య రూపకాలు గా ప్రదర్శించేవారు. చరిత్రలో వెనుకబడిన వర్గాలకు చెందిన కళాకారులు ఈ కళారూపాలను కొనసాగించారు. రేడియో, సినిమా, టెలివిజన్ రాకముందు ఇవే ప్రజలకు వినోదం, నైతిక బోధన, సామూహిక ఐక్యతకు ఆధారం. అయితే ప్రస్తుతం అనిశ్చిత ఆదాయం, పరిమిత ఆశ్రయం, పట్టణీకరణ కారణంగా అనేక కళాకారులు వేరే వృత్తుల వైపు మళ్లుతున్నారు. బతుకమ్మ పాటలు పండుగల ద్వారా నిలుస్తున్న ప్పటికీ, ఇతర కథా రూపాలు క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదంలో ఉన్నాయి. ప్రభుత్వ చర్యలు, తెలుగు విశ్వవిద్యాలయం మద్దతు, డిజిటల్ వేదికలు కొంత ఉపశమనం ఇచ్చాయి. అయితే ఆడియో-వీడియో రికార్డింగ్, భద్రపరచడం, లిఖిత రూపంలో నమోదు చేయడం, అనువాదాలు చేయడం అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. యూట్యూబ్ వంటి వేదికలు పునరుజ్జీవనానికి అవకా శాలు కనిపిస్తున్నప్పటికీ, ఇతిహాసాలు, గ్రామ దేవతల పురాణాలు, కులపరమైన కథలు ఇంకా నమోదు కాకుండా మాయమయ్యే ప్రమాదం ఉంది. తెలంగాణ సాహిత్య సంపద కూడా విశిష్టమే. బొమ్మెర పోతన, కంచర్ల గోపన్న వంటి మహానుభావులు ప్రాచీన పునా దులు వేశారు. ఆధునిక యుగంలో కాళోజీ నారా యణరావు, దాశరథి కృష్ణమా చార్యులు, సీ .నారాయణ రెడ్డి, మాజీ ప్రధాని పీ.వి.నరసింహారావు, వంటి ప్రముఖులతో పాటు గద్దర్, చెరబండరాజు, వరవర రావు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, గోరటి వెంకన్న, అందేశ్రీ వంటి రచయితలు తెలంగాణ భావజాలాన్ని ప్రతిబింబించారు. తెలుగు ప్రధాన భాషగా కొనసాగుతు న్నప్పటికీ, నిజాం పాలనలో అభివృద్ధి చెందిన ఉర్దూ భాష కూడా హైదరాబాద్ సాంస్కృతిక రూపురేఖలను ప్రభావితం చేస్తోంది. సమ్మక్క-సారలమ్మ జాతర నుంచి బతుకమ్మ, బోనాల వంటి పండుగల వరకు తెలంగాణ సంస్కృతి భక్తి, పోరాట స్ఫూర్తి, ఐక్యతకు ప్రతీక. ఆధుని కీకరణ వేగంగా సాగుతున్న ఈ కాలంలో ఈ మౌఖిక ప్రదర్శన సంప్రదాయాలను కాపాడడం సాంస్కృతిక బాధ్యత మాత్రమే కాక అత్యవసర కర్తవ్యంగా మారింది. సమయోచిత చర్యలు లేకపోతే వేల ఏళ్ల వారసత్వం చరిత్రలో కలిసిపోయే ప్రమాదం ఉంది.

## విద్య, సేవా రంగాల్లో


# బెన్నె నరేంద్ర భూపతికి గౌరవ డాక్టరేట్



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం:** విద్య, సామాజిక సేవా రంగాల్లో అందిస్తున్న సేవలకుగాను కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన బెన్నె నరేంద్ర భూపతికి గౌరవ డాక్టరేట్ లభించాయి. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి పరిధిలోని జనాభా అధ్యయనాలు, సామాజిక సేవ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి బెన్నె నరేంద్ర భూపతికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (సోషియల్ వర్క్) పట్టా ప్రదానం చేయడానికి విశ్వ విద్యాలయం నిర్ణయించింది. కర్నూలు జిల్లాలో వృద్ధుల జీవన శైలి ప్రవర్తనలు, మానసిక ఆరోగ్య ఫలితాలపై నిర్వహించిన "లైఫ్ స్టైల్ బిహేవియర్స్ అండ్ మెంటల్ హెల్త్ అవుట్ కమ్స్ అఫ్ ఎల్డర్లీ పీపుల్: ఏ స్టడీ ఇన్ కర్నూల్ డిస్ట్రిక్ట్ అఫ్ ఆంధ్ర ప్రదేశ్ " అనే అంశంపై సమర్పించిన పరిశోధన ప్రబంధాన్ని బోర్డ్ ఆఫ్ ఎగ్జామినర్స్ ఆమోదించినట్లు విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఈ పరిశోధనను ప్రొఫెసర్ డి.సాయి సుజాత మార్గదర్శకత్వంలో పూర్తి చేశారు. విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి డా.బి.రాజామాణిక్యం జారీ చేసిన అధికారిక ప్రకటన ప్రకారం బెన్నె నరేంద్ర భూపతి పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించారు.పత్తికొండ గ్రామం, కర్నూలు జిల్లా నివాసి అయిన డా. బెన్నె నరేంద్ర భూపతి ను పలువురు విద్యావేత్తలు, కుటుంబ సభ్యులు, సహచరులు అభినందించారు. ఈ పరిశోధనకు సహకరించిన నా గురువుకు, కుటుంబ సభ్యులకు, సాచర్లకు అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఓటమి ఎరుగని ధీరుడు ఛత్రపతి శివాజీ జయంతి

**- స్వాతంత్ర్య సమర యోధుడు సంఘ సంస్కర్త గోపాల కృష్ణ గోఖలే 111 వర్ధంతి**



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో ప్రెసిడెంట్ అబూబకర్ కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు ఆ ధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి, గోపాలకృష్ణ గోఖలే వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఛత్రపతి శివాజీ, గోపాల కృష్ణ గోఖలే చిత్రపటాలకు అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు పూలమాల వేసి నివాళు లర్పించారు. వక్తలు మాట్లాడుతూ మరాఠా సామ్రాజ్యానికి ఎదురులేని చక్రవర్తిగా పేరుగాంచిన శివాజీ రాజు ముఖ్యంగా నలుగురు గురువుల శిక్షణలో అత్యంత పరాక్రమవంతుడు, ధైర్యవంతుడు మేధావి అయ్యారు. వీరు 16 సంవ త్సరాల వయసులోనే కత్తి పట్టి తు రక శత్రు రాజ్యాలపై గెరిల్లా పద్ధతి లో యుద్ధం చేసి అనేక కోటలను గె లిచారు.గోపాలకృష్ణ గోఖలే మహా రాష్ట్రకు చెందిన భారత స్వాతంత్ర్య సమర యోధుడు.వీరు లాలాలజ ప తి రాయ్,అనిబిసెంట్ వంటి నాయ కులతో కలసి స్వాతంత్ర్య పోరాటం సాగించారు.భారతీయ విద్యా వ్యవ స్థను ఎంతగానో విస్తరింప చేసి,దాని ద్వారా మొబైల్ లైబ్రరీలు, పాఠశాలలు ఏర్పాటు చేశారు అని కోశాధికా రి జెన్నే కుల్లా యిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూ బాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు, సెక్రెటరీ రామ్ మోహన్, ఫక్రు ద్దీన్, నారాయ ణరెడ్డి, చెన్నారెడ్డి, శామ్యూల్, విజయ భాస్కర్ రెడ్డి, నారాయణ శెట్టి, దేవదాసు, ఓబులేసు, నరసింహులు, ఓబులేసు మొదలగు వారు పాల్గొన్నారు.

# శెట్టిపల్లి శ్రావణికి ఐఏఆర్ఐలో డాక్టరేట్ పట్టా





**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రఖ్యాతిగాంచిన ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నుండి "దక్షిణ భారతదేశ గ్రామీణ కూలీల పోషక స్థితిపై విశ్లేషణా త్మక పరిశోధన" చేసినందుకు గాను శెట్టిపల్లి శ్రావణి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా ఆమెకు ఈ డాక్టరేట్ పట్టా ప్రదానం చేయబడింది. శెట్టిపల్లి శ్రావణి గతంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో గోల్డ్ మెడల్ సాధించడం విశేషం. అన్నమయ్య జిల్లా రామా పురం మండలం బండపల్లి గ్రామానికి చెందిన వెంకటరెడ్డి పల్లె వీరి స్వగ్రామం. ఆమె తండ్రి వెంకటకృష్ణారెడ్డి లక్కిరెడ్డిపల్లిలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా సేవలందిస్తున్నారు. తల్లి వేదవతి సాధారణ గృహిణి. ఈ సందర్భంగా శెట్టిపల్లి శ్రావణి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పద్ధతులు, శాస్త్రీయ ఆవిష్కరణలను రైతులకు చేరవేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణాభివృద్ధితో పాటు రైతుల జీవన ప్రమాణాల మెరుగుదలకు తన పరిశోధనలు దోహదపడతాయని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఉత్తమ కానిస్టేబుళ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- జిల్లా ఎస్పీ పి.జగదీష్
- నూతన ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం
- శిక్షణార్థులతో కలిసి భోజనం చేసిన జిల్లా ఎస్పీ



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా పోలీస్ డిటిసిలో శిక్షణ పొందుతున్న 101 మంది ట్రైనీ కానిస్టేబుళ్లతో జిల్లా ఎస్పీ పి.జగదీష్ గురువారం నాడు సమావేశమయ్యారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని శిక్షణలో భాగం చేయాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారం భించారు. ఈ ల్యాబ్ ద్వారా శిక్షణార్థులు సైబర్ అవగాహన, డిజిటల్ రికార్డులు, నూతన పోలీసింగ్ విధానాలపై ప్రాక్టికల్ పరిజ్ఞానం పొందగలరని ఎస్పీ పేర్కొన్నారు. శిక్షణార్థుల వసతులపై ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎస్పీ వసతి గృహాలు, భోజనశాల, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. భోజనం నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, శిక్షణార్థులతో కలిసి భోజనం చేయడం ద్వారా వారిలో ఆత్మీయతను పెంపొందించారు. భోజనం రుచి చూసి ఆహారం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశుభ్రత, పోషకాహారం ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. శిక్షణార్థుల ఆరోగ్యం



మరియు శ్రేయస్సు పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యత అని పేర్కొన్నారు అనంతరం... శిక్షణార్థులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో ఇండోర్ మరియు ఔట్‌డోర్ శిక్షణా కార్యక్రమాల పురో గతిని ఎస్పీ అడిగి తెలుసు కున్నారు. తరగతుల నిర్వహణ, ఫిజికల్ ట్రైనింగ్, డ్రిల్, చట్టాలపై అవగాహన వంటి అంశాలపై శిక్షణార్థులతో చర్చించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా డిటిసి డీఎస్పీ దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి అవకాశం కల్పించారు. శిక్షణతో పాటు మంచి ప్రవర్తన, క్రమశిక్షణ, ప్రజల పట్ల మర్యాద, చట్టపరమైన అవగాహన వంటి అంశాలు ప్రతి కానిస్టేబుల్‌కు అత్యంత ముఖ్యమని ఎస్పీ పేర్కొన్నారు. సమాజానికి సేవ చేయడం పోలీస్ విభాగపు ప్రధాన బాధ్యత అని, చట్ట పరిధిలో ప్రజలకు ఉపయోగపడే విధంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిటిసి డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, సిఐ యువరాజు, ఆర్ ఐ లు మధు, పవన్ కుమార్, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా మహారాష్ట్ర సామ్రాజ్య నిర్మాత

# చత్రపతి శివాజీ జయంతి వేడుకలు

**- ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డా. సుధాకర్**



**వేంపల్లె – సూర్య వాస్తవం:** హైందవ సామ్రాజ్య పునరు ద్ధరణకు కృషిచేసి, హైందవ సంస్కృతి నాగరికత, ఆచార సంప్రదాయాలు భారతదేశంలో సజీవంగా నిలబడడానికి కారణమైన వ్యక్తి చత్రపతి శివాజీ అని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ పేర్కొన్నాడు. ఛత్రపతి శివాజీ 396వ జయంతిని పురస్కరించుకొని బుధవారం కళాశాలలో చరిత్ర, తెలుగు శాఖ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవ వేడుకలు జరిగాయి. దీనికి కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎల్ నాగలక్ష్మి దేవి అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన చరిత్ర శాఖ అధ్యాపకులు మరియు ప్రముఖ చరిత్ర కారుడు బాలకొండ గంగాధర్ మాట్లాడుతూ హైందవ సామ్రాజ్యం అనేక సందర్భాలలో పర మతస్తుల రక్క సి లో పడి సమాప్తమవుతున్నా సందర్భంలో అనేక హైందవ వీరులు దాన్ని పునరుద్ధరణకు కృషి చేశారని అందులో ముఖ్యమైన వాళ్ళ రాజపుత్రులు, విజయనగర సామ్రాజ చక్రవర్తులు మరియు మహారాష్ట్ర సామ్రాజ్య స్థాపకులు అని పేర్కొన్నారు. ముఖ్యంగా 17వ శతాబ్దంలో మహమ్మదీయ మతరక్కసిలో హిందూ సామ్రాజ్యము, హిందూ సంస్కృతి ,నాగరికత బలహీనపడిన నేపథ్యంలో చత్రపతి శివాజీ మహారాష్ట్ర సామ్రాజ్యాన్ని స్థాపించి ఔరంగాజేబు లాంటి మత మూర్ఖుడికి వ్యతిరేక పోరాటం చేయడం నేడు ఆదర్శ నియమని అన్నాడు. శివాజీ స్థాపించిన సామ్రాజ్యం కంటే కూడా అతను నాడు భారతదేశ చక్రవర్తులుగా కొనసాగిన మహమ్మదీయ పాలకులకు వ్యతిరేకంగా సైన్యం నిర్వహించిన తీరు. వారి నీ ఎదుర్కొన్న తీరు. నేడు పెద్ద చర్చనీయాంశంగా మారినాయని అభిప్రాయపడ్డారు. ఈ విధంగా శివాజీ మేనేజ్మెంట్ స్కిల్ కు సంబంధించి అనేక యూనివర్సిటీలలో పరిశోధనలు జరగడం ఆలోచించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల గ్రంథాలయ శాఖ అధిపతి డాక్టర్.పొట్లన్న మాధవరావు ,కామర్స్ అధ్యాపకురాలు డాక్టర్ మల్లీశ్వరమ్మ, కంప్యూటర్ శాఖాధిపతి కిరణమయి, కంప్యూటర్ అధ్యాపకుడు షఫీ ఫద్దీన్, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, ఉర్దూ అధ్యాపకురాలు రేష్మ, రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు ప్రసాద్, విద్యార్థిని విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

# దేశ సంపదలో సమన్యాయం చేయాలి

**- సీపీఐ డిమాండ్**




**వెంకటగిరి– సూర్య వాస్తవం:** దేశ సంపదను ప్రజలందరికీ సమానంగా పంపిణీ చేయాలన్న డిమాండ్ కోసం నేడు ఫిబ్రవరి 20 తేది వెంకటగిరి క్రాస్ రోడ్ సెంటర్ వద్ద నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజాస్వామికవాదులు, బహుజనవాదులు, ప్రజా సంఘాలు,కులసంఘాలు,భావస్వా రూప్యం గల సంస్థలు, వ్యక్తులు పాల్గొనవలసిందిగా వెంకటగిరి నియోజకవర్గ భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి పల్లిపాటి బాలకృష్ణయ్య, తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం.పెంచలయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. దేశంలో రోజు రోజుకి అసమానతలు పెరుగుతు న్నాయని, దేశ సంపద అతి కొద్దిమంది సంపన్నులు వద్ద పోగుపడుతుందని దేశ రాజకీయాలను సైతం ధనవంతులు శాసించే స్థితికి వచ్చేసిందని ఈ పరిణామం భారతదేశానికి, పేద వర్గాలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసే పరిస్థితులు ఉన్నందువలన దేశ సంపదను జనాభా నిష్పత్తి ప్రకారం పంపిణీ చేయడమే ఏకైక పరిష్కారం అన్నారు.




# శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీల తీరు సరికాదు

**- టీడీపీ శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి**

**పులివెందుల – సూర్య వాస్తవం:** శాసన మండలి సమావేశాలను సజావుగా సాగనీయ కుండా అడ్డుకుంటున్న వైకాపా ఎమ్మెల్సీల తీరుపై ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం హోంమంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ చీఫ్ విప్, పంచుమర్తి అనురాధ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఇతర సభ్యులతో కలిసి వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ శాసనమండలిలో వైకాపా ఎమ్మెల్సీలు ప్రజా సమస్యలపై చర్చలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తూ వ్యక్తిగత అజెండా అమలుకే ప్రాధాన్యత ఇచ్చి అబాసపాలవు తున్నారని ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకొని సమస్యల పరిష్కారానికి సహకరించాలని వైకాపా ఎమ్మెల్సీలకు సూచించారు.

# నారా లోకేష్‌తో ఆత్మీయ విందు జీవితంలో ఒక జ్ఞాపకం

- సొంత కుటుంబ సభ్యుడిలా మమ్మల్ని పలుకరించారు: ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- మంత్రి లోకేష్‌తో ఆత్మీయ విందులో పాల్గొన్న దగ్గుపాటి ఫ్యామిలీ
- కుటుంబసభ్యులను ప్రత్యేకంగా పలుకరించిన నారా లోకేష్



**అనంతపురం - సూర్య వాస్తవం :** ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌తో ఆత్మీయ విందు జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకంగా ఉంటుందని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉండవల్లి నివాసంలో ఉమ్మడి అనంతపురం జిల్లా కూటమి నేతలకు మంత్రి నారా లోకేష్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆయన సతీమణి శ్రీలక్ష్మి, కూతురు అశ్రిత పాల్గొన్నారు. ఎమ్మెల్యే కుటుంబసభ్యులకు లోకేష్ ఎంతో ప్రేమగా ఆహ్వానం పలికారు. అనంతరం అందరు ప్రజాప్రతినిధుల కుటుంబసభ్యులతో కలిసి ఆత్మీయ విందులో పాల్గొన్నారు. భోజనం చేస్తున్న సమయంలో లోకేష్ గారు ప్రతి ఒక్కరితో ఆత్మీయంగా పలుకరించారు. దగ్గుపాటితో పాటు ఆయన సతీమణి, కూతురును ప్రత్యేకంగా పలుకరించారు. అశ్రిత ఏం చదువుతున్నావ్, ఫ్యూచర్ ప్లాన్స్ ఏంటి.. తమ్ముడు ఎలా ఉన్నాడు.. చదువు బాగా సాగుతోందా అంటూ లోకేష్ ఆరా తీశారు. రాజకీయాలకు అసలు ఏమాత్రం సంబంధం లేకుండా ఒక కుటుంబ సభ్యు నిలా పలుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ తనకు ఊహ తెలిసినప్పటి నుంచి రాజ కీయా ల్లో ఇంత ఆప్యాయత పంచే నాయకుడిని చూడలేదన్నారు. గతంలో చాలా సార్లు చాలా మంది నేతలతో విందు, ఇతర కార్య క్రమాల్లో పాల్గొన్నానని.. కానీ ఇది మాత్రం తనకు ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు. మా కుటుంబసభ్యులు కూడా మంత్రి లోకేష్ పలుకరించే తీరు చూసి ఆశ్చర్యపోయా రన్నారు. ఆయన భవిష్యత్‌లో గొప్ప నాయకుడవుతారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు.

# ఆత్మ బంధువులు.. ఆ నలుగురు...!


- అనాధ వృద్ధుడికి హిందూ పద్ధతిలో అంతక్రియలు
- రంజాన్ ఉపవాస దీక్షలో కుడా వీడని సేవామార్గం
- ఆదర్శంగా నిలుస్తున్న అనంతపురం మైనారిటీలు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** ఈ సమాజంలో ప్రతి పుట్టిన జీవి గిట్టక తప్పదు. కొందరు మనుషులు చిరునామాతో చనిపోతే....మరికొందరు ఎవ్వరు లేని అభాగ్యులుగా చనిపోతున్నారు. అయినా వాళ్ళు వున్న ఈ రోజుల్లో అంత్యక్రియలు చేయడానికి నానా అవస్థలు, ఇబ్బందులు పడుతుంటే ఏ ఆధారం లేని అనాథలు, గుర్తు తెలియని వ్యక్తులు ఎక్కడైనా మృతి చెందిన వార్త వింటే అనంతపురం నగరానికి చెందిన మైనారిటీలు చలించి పోయి అంత్యక్రియలు గావిస్తున్నారు. అనాథ శవాలను తీసుకెళ్లేందుకు సంబంధికులు ముందుకు రాకుంటే అన్నీ తామై వారి సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. అనాథల మరణ వార్త విన్న ఐ.ఎం.ఎం మహ బూబ్ బాషా, పావురాల చంద్రశేఖర్,మాజీ కార్పొరేటర్ షేక్షావలి,ఏజాజ్ అహ్మద్ ఆత్మబంధువులుగా మారి అంత క్రియలు నిర్వహిస్తున్నారు. అనంతపురం పట్టణంలో పాత ఊర్లోనే స్థానిక లక్ష్మమ్మ గుడి దగ్గర నా అనేవారు లేని వృద్ధ యాచకుడు మరణించిన సంగతి అనంతపురం ఒకటవ పట్టణ సీఐకు తెలియజేసి నా అనేవారు లేని వృద్ధ యాచకుడిని మానవత్వంతో ముందుకొచ్చి హిందూ స్మశాన వాటికలో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. మానవత్వంతో ముందుకు వచ్చి యాచ కుడికి అంత్యక్రియలు నిర్వహించిన ఐ.ఎం.ఎం మహ బూబ్ బాషా, పావురాల చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్ షేక్షావలి, ఏజాజ్ అహ్మద్, హనుమాన్‌ను స్థానికులు అభినందించారు.

# పోలీస్ నిఘా నీడలో రైల్వే స్టేషన్

- సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక డాగ్ స్క్వాడ్ బృందాల పరిశీలన.....!



**అనంతపురంక్రైమ్ -సూర్య వాస్తవం:** మాదకద్రవ్యాలైన గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, అమ్మకాలు, సేవించడం నియంత్రిం చేందుకు అనంతపురం మూడవ పట్టణ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం నాడు అనంతపురం రైల్వేస్టేషన్‌లో డాగ్‌స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు... ఇతర రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల నుండీ వచ్చే రైళ్లలో మరియు అనంతపురం రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్ ద్వారా అనంతపురం మూడవ పట్టణ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా పోలీసులు రైళ్లలో తనిఖీలు కొన సాగాయి. నార్కోటిక్స్ పసిగట్టడంలో తర్ఫీదు పొందిన టైగర్ జాగిలం ద్వారా అనంతపురం గుండా వెళ్లే రైళ్లలో పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. ఒడిస్సాలోని భువనేశ్వర్ నుండీ బెంగుళూరుకు జిల్లా కేంద్రం మీదుగా వెళ్లే ప్రశాంతి ఎక్స్ ప్రెస్, తదితర రైళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సాధారణ ప్రయాణీకులకు అసౌకర్యం కల్గకుండా ఈ తనిఖీలు కొనసా గాయి. గంజాయి, అక్రమ మద్యం రవాణా జరుగకుండా లోతుగా చెక్ చేశారు. అనుమానాస్పదులు, వారి లగేజీలను టైగర్ జాగిలం ద్వారా లోతుగా తనిఖీ చేశారు.

# శ్రీవృషభలేశ్వర స్వామి దేవస్థానం టెండర్ ప్రకటన

- కార్యనిర్వహణాధికారి సుభాష్

**వేంపల్లె - సూర్య వాస్తవం:** శ్రీ వృషభాషలేశ్వర స్వామి దేవస్థానం, వేంపల్లి పట్టణం వైయస్సార్ జిల్లాకు సంబంధించి ఆలయాలకు శ్రీస్వామి వారి అలంకరణకు ప్రతి రోజు పూలమాలలు సప్లై చేయి హక్కు, తలనీలాలు ప్రోగు చేసుకొను హక్కులకు ఒక సంవత్సర కాలమునకు షీల్డ్ టెండర్లు, బహిరంగ వేళముకార్యక్రమం 21వ తారీకు శనివారం ఉదయం 10 గంటల నుండి నిర్వహించబడును. ఆసక్తిగల టెండర్ దారులు సదరు షీల్డ్ టెండర్లు, బహిరంగ వేలంలో పాల్గొనవలసిందిగా తెలియజేయ డమైందని తెలియజేశారు. పూలమాలలు సప్లై హక్కు నకు సంబంధించి రూ.1000 లు చెల్లించి, టెండర్ షెడ్యూలను దేవస్థానము కార్యాలయ పని వేళలలో 20వ తేదీలోపు తీసుకొని, 21 వ తేదీ ఉదయం 10:30 గంటలలోపు టెండర్ బాక్స్‌లో వేయవలసిందిగా తెలియజేయడమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో కడప సుభాష్ కార్యనిర్వాహణాధికారి, దేవస్థానం ఛైర్మన్ పీవీరమణ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ విధులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం:** మండల పరిధిలోని ఇమకుంట్ల గ్రామపంచాయతీ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పులివెందుల 'డిఎస్పి మురళి' ఆదేశాల మేరకు పులివెందుల 'రూరల్ సీఐ రమణ' పర్యవేక్షణలో విద్యార్థులకు, పోలీసుల విధి విధానాలు, చట్టాలపై అవగాహన సదస్సు కార్యక్రమం 'ఎస్సై అనిల్ కుమార్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు 'పోలీసు శాఖ' విధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీసులు కేవలం నేరస్థులను, పట్టుకోవడమే కాకుండా సమాజంలో శాంతి భద్రతలు, చట్టపరమైన అవగాహన పెంపునకు నిరంతరం కృషి చేస్తారన్నారు. ప్రజల రక్షణ, మహిళ, భద్రత, నేరాల నియంత్రణకు పని చేస్తుందని, ట్రాఫిక్, నిబంధనలు, పాటించడం వల్ల రోడ్డు, ప్రమాదాలు అరికట్టవచ్చునని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు, సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్, మత్తు, పదార్థా లకు దూరంగా ఉండాలన్నారు. యాప్‌ల' ద్వారా రుణాలు తీసుకుంటూ చెల్లించక పోవడం వల్ల ఆత్మహత్యలకు, పాల్పడుతున్నారని, యాప్‌లపై అప్రమత్తంగా ఉండా లని ఆయన కోరారు. మహిళల పై జరుగుతున్న నేరాలను అరికట్టడానికి, వారి రక్షణ గురించి "షీటీం" పనిచేస్తుందన్నారు. పోలీస్ విధులు, కమ్యూనికేషన్, సిస్టం, ఫింగర్ ప్రింట్‌డివైజ్‌ల, వల్ల ఉపయోగాల గురించి, బీడీ టీమ్ ఎక్విప్ మెంట్, డాగ్ స్క్వాడ్, రోడ్డు ప్రమాదాల స్పీడ్‌లేజర్‌గన్, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# మహిళల ఆర్థిక సాధికారతే ఆర్డీటి లక్ష్యం

- విశాలా ఫెర్రర్





**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి మండలంలో ఆర్డిటి ఆధ్వర్యంలో ఆర్డిటి మహిళా సంఘాలకు చెందిన మహిళలు కలిసి ధాత్రి మహిళా కో-ఆపరేటివ్ బ్యాంకును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్యాంకును ప్రారంభించిన ఆర్డిటి డైరెక్టర్ విశాలా ఫెర్రర్ మాట్లాడుతూ గ్రామీణ దళిత, గిరిజన మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి, వ్యవసాయం, జీవనోపాధి కార్యక్రమాలు, చిన్న వ్యాపారాలు, పిల్లల విద్య, ఆరోగ్య అవసరాల కోసం ఈ బ్యాంకు ద్వారా రుణాలు పొందవచ్చని తెలిపారు. కేవలం ఒకటిన్నర శాతం వడ్డీతో రుణాలు తీసుకొని సులభంగా తిరిగి చెల్లించే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. దీని ద్వారా మహిళల్లో ఆర్థిక స్వావలంబన పెరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. "అందరి కోసం ఒకరు - ఒకరి కోసం అందరూ" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని, బ్యాంకు నిర్వహణ బాధ్యత పూర్తిగా మహిళలదేనని విశాలా ఫెర్రర్ తెలిపారు.

# శెట్టిపల్లి శ్రావణిరెడ్డికి ఐఏఆర్ఐలో డాక్టరేట్ పట్టా

- శ్రావణి రెడ్డికి అభినందనలు తెలియజేసిన అఖిలభారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి




**రాయచోటి - సూర్య వాస్తవం:** ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రఖ్యాతిగాంచిన ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నుండి "దక్షిణ భారతదేశ గ్రామీణ కూలీల పోషక స్థితిపై విశ్లేషణాత్మక పరిశోధన" చేసినందుకు గాను శెట్టిపల్లి శ్రావణి రెడ్డి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా ఆమెకు ఈ డాక్టరేట్ పట్టా ప్రదానం చేయబడింది.శెట్టిపల్లి శ్రావణిరెడ్డి గతంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో గోల్డ్ మెడల్ సాధించడం విశేషం. అన్నమయ్య జిల్లాలోని రాయచోటి నియోజకవర్గం రామాపురం మండలం బండపల్లి గ్రామానికి చెందిన వెంకట రెడ్డిపల్లె వీరి స్వగ్రామం. ఆమె తండ్రి వెంకటకృష్ణారెడ్డి లక్కిరెడ్డిపల్లిలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా సేవల ందిస్తున్నారు. తల్లి వేదవతి సాధారణ గృహిణి. శెట్టిపల్లి శ్రావణి రెడ్డి వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పద్ధతులు, శాస్త్రీయ ఆవిష్కరణలను రైతులకు చేరవేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణా భివృద్ధితో పాటు రైతుల జీవన ప్రమాణాల మెరుగుదలకు తన పరిశోధనలు దోహదపడతాయని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. శ్రావణి రెడ్డికి డాక్టరేట్ పట్టా రావడం పట్ల అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురుకూటి రామభూపాల్ రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పొన్నపురెడ్డి శకుంతలరెడ్డి గురువారం శ్రావణి రెడ్డిని ఫోను ద్వారా అభినందనలు తెలియజేశారు.

## గ్రామాలలో నీటి కాలువల పూడిక తీత పనులకు

# గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వినియోగించాలి

- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్
- మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, వాటర్ గ్రిడ్ పనులను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** గ్రామాలలో కాలువల పూడికతీత పనులకు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం గుర్రంకొండ మండలం ఎల్లుట్ల గ్రామంలో నరేగా పనులు, నల్లచెరువు పనులు, చెర్లోపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల, నడిమి కండ్రిగలోని అంగన్వాడీ కేంద్రం, సంఘసముద్రం గ్రామ పంచాయతీ, మామిళ్ళ వారి పల్లి దగ్గర జరుగుతున్న వాటర్ గ్రిడ్ పనులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఎల్లుట్ల గ్రామంలో జరుగుతున్న నరేగా పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, గ్రామంలోని చెరువుకు నీరు వెళ్లే కాలువ పూడికతీత పనులను గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద చేస్తున్న వారిని మరియు జిల్లా నీటి యాజమాన్య సంస్థ సిబ్బందిని, గ్రామంలో ఎంత మంది నరేగా పనుల కింద పని చేస్తున్నారు ఎంతమందికి పనులు కల్పించగలరు ఎన్ని గంటలు పనిచేస్తారు తదితర పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. కాలువ పూడిక తీత పనుల తర్వాత చెరువు పూర్తిగా నిండేలా చర్యలు తీసుకోవాలని వర్షాకాలంలో పడే ప్రతి బొట్టును చెరువులోకి చేరవేసేలా కాలువ పనులు పూర్తవాలని ఆదేశించారు. అనంతరం నరేగా పనులు జరుగుతున్న ప్రాంతంలోని ఒక టమాటో రైతును పంటను ఎక్కడ అమ్ముతారు ఇతర రాష్ట్రాలకు అమ్ముతున్నారా లేక ఇక్కడే అమ్ముతున్నారా వంటి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని నల్లచెరువును పరిశీలించి సాగునీటి శాఖ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో వరి పంట కాకుండా రైతులకు ఆదాయాన్ని ఎక్కువగా ఇచ్చే ఉద్యాన పంటలను పండించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పంచాయతీ నిధులు మరియు గ్రామంలో



చెత్త సేకరణ పై గ్రామ పంచాయతీ సెక్రటరీని పలు ప్రశ్నలు అడిగి తగు సూచనలు చేశారు

అక్కడి హరిజనవాడలో నివసిస్తున్న గ్రామస్తులు తమకు దారి సమస్య ఉందని హరిజనవాడకు ఒక గుడిని కట్టించవలసిందిగా జిల్లా కలెక్టర్కు విన్న వించుకోగా జిల్లా కలెక్టర్ సమస్యలను వెంటనే పరిష్క రించాలని మండల తాసిల్దార్ను ఆదేశించారు. పట్టా దారు పాసు పుస్తకాల పంపిణీ ఏ విధంగా జరుగు తుందో తాసిల్దార్ని అడిగి తగు సూచనలు చేశారు. అనంతరం మామిడి తోటను పరిశీలించి మామిడి కాయలకు ప్రభుత్వం సబ్సిడీతో అందించే కవర్లను స్వయంగా అందించారు. మామిడి కవర్లను ఏ విధంగా వినియో గించుకోవాలి అనే విషయంపై గ్రామస్తులందరికీ అర్థమయ్యేలా తెలియ చెప్పాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు.

చెర్లోపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పాఠశాలలో చదువు తున్న విద్యార్థిని విద్యార్థుల పుస్తక పట్టణ సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం అమలుపై అధికారులను, సిబ్బందిని పలు ప్రశ్నలు అడిగి తగు సూచనలు చేశారు. నడిమి కండ్రిగలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని స్వయంగా పరిశీలించారు. పిల్లల ఎత్తు మరియు బరువును స్వయంగా పరిశీలించి రిజిస్టర్లలో నమోదు చేసిన నెంబర్లతో సరిపోల్చారు. అనంతరం ఐసిడిఎస్ శాఖ అధికారి హైమావతి కి అంగన్వాడీ కేంద్రాలపై పలు సూచనలు చేశారు. సంఘ సముద్రం గ్రామపంచాయతీ, మామిళ్ళ వారి పల్లి దగ్గర జరుగుతున్న వాటర్ గ్రిడ్ పనులను పరిశీలించి వాటర్ గ్రేడ్ పనులను త్వరగా పూర్తి చేయాలని వాటర్ గ్రిడ్ పను లకు స్థానికులను వినియోగించుకోవాలని సూచించారు.

## సమస్యలను గాలికి వదిలేయడం

# గత ప్రభుత్వ నైజం

- పరిష్కారం చూపడం కూటమి ప్రభుత్వ లక్ష్యం
- గత ప్రభుత్వ పులివెందుల అభివృద్ధిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మండిపాటు



పులివెందుల - సూర్య వాస్తవం: సమస్యలను గాలికి వదిలేయడం గత ప్రభుత్వ నైజం మరియు పరిష్కారం చూపడం కూటమి ప్రభుత్వ లక్ష్యం అని గత ప్రభుత్వ తీరుపై అసెంబ్లీలో పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంపై గత ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీ సాక్షిగా ఎండ గొడుతూ సొంత నియోజకవర్గాన్ని కూడా అభివృద్ధి చేయలేని స్థితిలో గత పాలకులు ఉన్నారని విమర్శిస్తూ మల్లెల గ్రామంలో మహాత్మా గాంధీ మన జ్యోతి పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ స్కూల్ నిర్మాణానికి సంబంధించిన రూ.19.62 కోట్ల నిధులను పెండింగ్లో పెట్టి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్నారని, అరటి రైతులకు ఎంతో మేలు చేసే ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ యూనిట్లను పూర్తిగా విస్మరించాలని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సాధించిందని, వేంపల్లి నుండి గండి వరకు రోడ్డు విస్తరణ, కాలేటి వాగు రిజర్వాయర్ పనులను గత ప్రభుత్వం అస్సలు పట్టించుకోలేదని వాటన్నింటినీ కూటమి ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నం చేస్తుందని అసెంబ్లీ సాక్షిగా వివరించారు.

# పాఠశాల అభివృద్ధికి అండగా నిలుస్తున్న ధనుంజయ నాయుడు

- టేబుల్ టెన్నిస్ బోర్డు విరాళం




**లింగాల - సూర్య వాస్తవం:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో పార్నపల్లి టిడిపి నాయకులు ధనుంజయ నాయుడు తన ఉదారతను చాటుకున్నారు.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ బోర్డును గురువారం ఉదయం మండల విద్యాశాఖ అధికారులు ఘనంగా ప్రారంభించారు. గ్రామస్తుల, విద్యార్థుల అవసరాలను గుర్తించి,క్రీడా రంగంలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ధనుంజయ నాయుడు ముందుకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పాఠశాల మౌలిక వసతుల కల్పనలో దాతల సహకారం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారులు శ్రీ రామకృష్ణయ్య, శ్రీ విశ్వనాథ రెడ్డి, ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఆ.మధుసూదన్ రావు దాత ధనుంజయ నాయుడుని ప్రత్యేకంగా అభినందించారు. ఇతర పాఠశాలలకు కూడా ఇలాంటి సహకారం అందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ధనుంజయ నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు.

# వీఆర్వోల సమస్యలను పరిష్కరించండి

- తహశీల్దార్కి వినతిని అందించిన వీఆర్వోలు



**పులివెందుల - సూర్య వాస్తవం:** రీ సర్వేను పురస్కరించుకొని వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పులివెందుల తహసిల్దార్ నజీర్ అహ్మద్కి మండలంలోని విఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేర్లు వినితి పత్రం సమర్పించారు. రీ సర్వేలో గ్రౌండ్ ట్రూతింగ్ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు ఉదయం 9 గంటల కంటే ముందుగా ఫీల్డ్కు వెళ్లవలసి ఉండగా వీఆర్వోలకు ఎస్ జి డబ్ల్యూ ఎస్ అటెండెన్స్ యాప్లో ముందుగా బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేసుకోవడానికి అవకాశం లేనందున రీసర్వే దృష్ట్యా గ్రామ రెవెన్యూ అధికారులను ఇతర గ్రామాలలో రీసర్వే పనులకు ఆదేశించి ఉన్నందున గ్రామ సర్వేయర్ల మాదిరి రీ సర్వే అటెండెన్స్లో అదర్ ఆప్షన్ ఉన్నట్టుగా వీఆర్వోలకు మినహాయింపు ఇవ్వవలసినదిగా గ్రామ రెవెన్యూ అధికారులు గ్రేడ్ -2, గ్రామ సర్వేలకు లైన్ డిపార్ట్మెంట్ అయినా రెవెన్యూ డిపార్ట్మెంట్ ద్వారా జీతం ఇచ్చే లాగున తహశీల్దార్ని డిడిఓగా, స్వర్ణ గ్రామ క్లస్టర్ల కేటాయింపులో వీఆర్వోలకు సర్వేయర్లకు మినహాయింపు ఇవ్వ వలసిందిగా వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రామాంజనేయులు, నాగ సుబ్బరాయుడు, ఆంజనేయులు, వీఆర్ఏలు పాల్గొన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై అవగాహన

- సీఐ నరసింహులు





**వేంపల్లె - సూర్య వాస్తవం:** మండలంలోని రాజీవ్ నగర్ కాలనీలో మహిళల భద్రత పై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించినట్లు సీఐ. నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు డయల్ 112 సేవలు, శక్తి యాప్ వినియోగం, బాల్య వివాహాల నివారణ, వరకట్న వేధింపులు మరియు కుటుంబ హింసపై చట్టపరమైన చర్యల గురించి వివరించారు. మహిళలు ఎలాంటి ఇబ్బందులు లేదా వేధింపులు ఎదుర్కొన్నా భయ పడకుండా వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని, పోలీస్ శాఖ తక్షణమే స్పందిస్తుందని సీఐ. నరసింహులు తెలిపారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేయడం ద్వారా వేగంగా సహాయం పొందవచ్చని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అలాంటి ఘటనలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వరకట్న వేధింపులు, కుటుంబ హింస వంటి సమస్యలను మహిళలు సహించకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో చట్టాలపై అవగాహన పెరిగి, తమ భద్రతపై మరింత జాగ్రత్త వహించే అవకాశం ఉంటుందని సిఐ నరసింహులు పేర్కొ న్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలు, మహిళల రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు.

# గంగమ్మ దేవత హుండీ ఆదాయం రూ.17,96,420

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** శ్రీశ్రీ అనంతపురం గంగమ్మ దేవత జాతర సందర్భంగా మూడు రోజుల హుండీలను గురువారం లెక్కించారు. రూ. 17,96,420 వచ్చినట్లు ఈ.ఓ. శ్రీనివాసులు తెలిపారు. ఈ మొత్తం నగదును ఆలయ ఖాతాకు జమ చేయనున్నట్లు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.



# శివాజీ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

- ఎర్రగుడిపాలెం ఘనంగా ఛత్రపతి శివాజీ 556వ జయంతి వేడుకలు
- కడప పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి అక్కులుగారి విజయ్ కుమార్ రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం:** మరాఠా వీరుడు, హిందూ ధర్మ రక్షకుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ 396వ జయంతి వేడుకలు గురువారం పులివెందుల మండలంలోని ఎర్రగుడిపాలేంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. కడప పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి అక్కులుగారి విజయ్ కుమార్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజయ్ కుమార్ రెడ్డి యూత్ సేన సభ్యులతో కలిసి వేడుకలను ఘనంగా జరిపారు. శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని విజయ్ కుమార్ రెడ్డి కేక్ కట్ చేసి అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ కేవలం ఒక రాజు మాత్రమే కాదని, ధైర్యసాహసాలకు, పరిపాలనా దక్షతకు నిదర్శనమని కొనియాడారు. శివాజీ చూపిన పోరాట పటిమను,క్రమశిక్షణను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. విజయ్ కుమార్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువకులు పాల్గొని శివాజీ మహరాజ్ నామస్మరణతో సందడి చేశారు.

# జాతీయ రహదారి 42పై శరవేగంగా ప్యాచ్ వర్క్ పనులు




**శాంతిపురం -సూర్య వాస్తవం :** జాతీయ రహదారి 42పై పలమనేరు నుండి కుప్పం వరకు ఉన్న రహదారిపై ఏర్పడిన గుంతలను ప్యాచ్ వర్క్ ద్వారా ఎన్ హెచ్ఏఐ అధికారులు పూర్తి చేస్తున్నారు. గురువారం శాంతిపురం మండల కేంద్రంలో ఆ రహదారి పై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టారు. ఈ ప్యాచ్ వర్క్ అయిన తర్వాత పూర్తిస్థాయి తారు రోడ్డు పనులను చేపట్టనున్నారు.



# సంగీతమే నా తొలి ప్రాధాన్యం : దేవిశ్రీప్రసాద్

'సంగీత దర్శకుడిగా నా కెరీర్ 'దేవి' అనే సినిమాతో మొదలైంది. ఇప్పుడు నటుడిగా నా తొలి చిత్రం 'ఎల్లమ్మ'. ఒక నెలలోపే అంతా చకచకా జరిగిపోయింది. నేను ఈ సినిమా కోసం సూపర్ ఎగ్జైటింగ్‌గా ఉన్నాను. గతంలో ఎన్నో ఆఫర్లు వచ్చాయి. వాటన్నింటినీ తిరస్కరించా. దిల్‌రాజు గారి మాట కాదనలేక ఒప్పుకున్నా.

హీరోగా మారుతున్నప్పటికీ నా మొదటి ప్రాధాన్యత ఎప్పుడూ సంగీతానికే. 'ఎల్లమ్మ' కూడా ఒక సంగీత ప్రాధాన్యత ఉన్న కథే. నా సంగీతాన్ని ఇష్టపడే వారందరికీ ఈ సినిమా ఒక గొప్ప నివాళిలా ఉంటుంది. మ్యూజిక్ ఎప్పటికీ నా జీవితం' అని కథానాయకుడు దేవిశ్రీప్రసాద్ అన్నారు. 'బలగం' చిత్రంతో సంచలనం సృష్టించిన దర్శకుడు వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న 'ఎల్లమ్మ'తో కథానాయకుడిగా దేవి శ్రీ ఎంట్రీ కాబోతున్నారు. నిర్మాత దిల్‌రాజు.

ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో 'పర్ష' అనే పవర్‌ఫుల్ పాత్రలో దేవిశ్రీ లుక్ ఆకట్టుకునేలా ఉంది. సినిమా ప్రయాణం గురించి మీడియా మిత్రులు అడిగిన ప్రశ్నలకు ఆయన పై విధంగా సమాధానం ఇచ్చారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని దిల్‌రాజు చెప్పారు.

# 'కల్ట్'లో 40 మంది నటులు




విశ్వక్‌సేన్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'కల్ట్' (Cult). 'ఫలక్‌నుమా దాస్', 'దాస్ కా దమ్కీ' వంటి సినిమాల తర్వాత ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఎంతో ఉత్కంఠభరితంగా, సాహసోపేతమైన కథాంశంతో ఉండబోతుందని తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా ద్వారా ఏకంగా 40 మంది కొత్త నటీ నటులను వెండితెరకు పరిచయం చేస్తున్నట్లుగా సమా చారం. ఇందులో గాయత్రి భరద్వాజ్ కథానాయిక.

ఈ సినిమా టీజర్ శనివారం విడుదల కానుంది. 'కేజీఎఫ్?' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం. దర్శకుడు తరుణ్ భాస్కర్ సంభాషణలు. సందీప్ కాకర్ల, కరాటే రాజు నిర్మిస్తున్నారు.

# హెబ్బా పటేల్ కొత్త చిత్రం 'మిరాకిల్'




సైదా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిరాకిల్'. ప్రభాస్ నిమ్మల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా హెబ్బా పటేల్ నటిస్తున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూళ్లు పూర్తి చేసుకున్న ఈ సినిమా మూడో షెడ్యూల్‌ను ఈ నెల 24 (ఫిబ్రవరి 24) నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనున్నారు. రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. నాయుడు పెంద్ర ఈ సినిమాతో విలన్‌గా పరిచయం అవుతున్నారు.



# వారెవ్వా.. జింబాబ్వే




## - ఆతిథ్య శ్రీలంకపై గెలుపుతో గ్రూప్-బి టాపర్‌గా సూపర్-8కు

**కొలంబో:** టి20 ప్రపంచకప్‌లో జింబాబ్వే జట్టు సంచలన విజయాలతో రాణిస్తోంది. మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించి సూపర్-8 బెర్త్‌ను ఖాయం చేసుకున్న జింబాబ్వే.. గురువారం జరిగిన గ్రూప్-బి చివరి లీగ్ మ్యాచ్‌లో ఏకంగా ఆతిథ్య శ్రీలంకకు ఝలక్ ఇచ్చింది. ప్రేమదాస స్టేడియంలో గురువారం జరిగిన గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో జింబాబ్వే 6 వికెట్ల తేడాతో శ్రీలంకపై విజయం సాధించింది. శ్రీలంక నిర్దేశించిన 179 పరుగుల భారీ లక్ష్యాన్ని జింబాబ్వే 19.3 ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (63నాటౌట్; 48బంతుల్లో, 8ఫోర్లు) ఆఖరి వరకు క్రీజులో నిలిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్ సికందర్ రాజా (45; 26బంతుల్లో, 2ఫోర్లు, 4సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్‌తో రాణించాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 40బంతుల్లోనే 69 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పడంతో మ్యాచ్ జింబాబ్వే వైపు మొగ్గింది. ఆరంభంలో మరో ఓపెనర్ మరుమాని(34) కూడా వేగంగా ఆడాడు. చివరిలో టోనీ మున్యోంగా (8నాటౌట్) ఒక సిక్సర్‌తో లాంఛనంగా మ్యాచ్‌ను ముగించాడు.

అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. ఓపెనర్ పతుమ్ నిస్సంక(62) అర్ధ సెంచరీతో రాణించగా.. చివర్లో పవన్ రత్నాయకే(44) దూకుడుగా ఆడి స్కోరు బోర్డును పరుగెత్తించాడు. కుశాల్ పెరీరా(22) ఫర్వాలేదనిపించాడు. జింబాబ్వే బౌలర్లలో గ్రేమ్ క్రీమర్, బ్లెస్సింగ్ ముజరబానీ, బ్రాడ్ ఇవాన్స్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. ఈ గెలుపుతో గ్రూప్-బిలో జింబాబ్వే 7పాయింట్లతో అగ్రస్థానంలో, శ్రీలంక 6పాయింట్లతో 2వ స్థానంలో నిలిచి సూపర్-8కు చేరాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సికిందర్ రాజాకు దక్కింది. సూపర్-8లో జింబాబ్వే 23న వెస్టిండీస్, 26న ఇండియా, మార్చి 1న దక్షిణాఫ్రికాతో తలపడనుంది.

# సూపర్-8 షెడ్యూల్ ఇదే..

## - 21 నుంచి సూపర్-8 మ్యాచ్‌లు

ఐసిసి టి20 ప్రపంచకప్ లీగ్ మ్యాచ్‌లు ముగిసేందుకు మరో రెండ్రోజులు సమయం ఉన్నా.. సూపర్-8కు చేరే జట్లేవో తేలిపోయాయి. గ్రూప్ దశలో మూడు మ్యాచ్‌లు ముగిసేసరికే దాదాపుగా అన్ని సూపర్-8 బెర్త్‌లు ఖరారు కాగా.. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు నమీబియాను ఓడించి సూపర్-8కు చేరిన చివరి జట్టుగా నిలిచింది. 20 జట్లతో ప్రారంభమైన ఈ మెగా టోర్నమెంట్ దాదాపు 12జట్లు లీగ్ దశలోనే నిష్క్రమించగా.. సూపర్ 8 దశకు 8జట్లు చేరాయి. ఈ ఎనిమిది జట్లను గ్రూప్-1, గ్రూప్-2గా విభజించగా.. ప్రతి గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌లో తలపడతాయి. ఈ ఎనిమిది జట్లను నాలుగు చొప్పున రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-1లో భారత్, వెస్టిండీస్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా, గ్రూప్-2లో పాకిస్తాన్, ఇంగ్లండ్, శ్రీలంక, న్యూజిలాండ్ జట్లు ఉన్నాయి. 21 నుంచి మార్చి 1 వరకు భారత్, శ్రీలంక వేదికలుగా ఈ కీలక మ్యాచ్‌లు జరగనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా భారత్ ఈ దశలోకి అడుగుపెడుతుండగా... వెస్టిండీస్, ఇంగ్లండ్, పాకిస్థాన్, శ్రీలంక జట్లకు కూడా టైటిల్ గెలిచిన అనుభవం ఉంది. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు నిలకడగా రాణిస్తూ ఎప్పటిలాగే బలమైన పోటీదారులుగా ఉన్నాయి. ఈ టోర్నీలో అనూహ్య ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన జింబాబ్వే కూడా ఈసారి సూపర్-8లో అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.



# ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి

## - శౌర్యం-ధర్మపాలనకు చిహ్నమైన మహావీరునికి ఘన నివాళులు
## - జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్










**వేంపల్లె - సూర్య వాస్తవం:** భారత జాతి గర్వకారణమైన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించు కొని స్థానిక పట్టణంలో ఘనంగా నివాళులర్పించారు. జనసేన పార్టీ నేత డా. దాసరి రవిశంకర్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శివాజీ మహారాజు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ,శౌర్యం, పరాక్రమం, ధర్మపాలనకు ప్రతీకగా నిలిచిన శివాజీ మహారాజు యువతరానికి స్ఫూర్తిదాయకుడని పేర్కొన్నారు. తన మతాన్ని కాపాడుకుంటూనే పరమత సహనంతో రాజ్యాన్ని పాలించిన లౌకిక దృక్పథం గల మహానేతగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. పటిష్ఠమైన మరాఠా సామ్రాజ్య స్థాపకుడిగా, రాజనీతిజ్ఞుడిగా శివాజీ మహారాజు దేశ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించారని తెలిపారు. ఆయన ఆలోచనలు, ఆచరణలు నేటి సమాజానికి మార్గదర్శకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగ మల్లికార్జున, రమేష్ రెడ్డి, కృష్ణ, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

**పామిడిలో ...** గురువారం భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి శోభయాత్ర అత్యంత నాయన మనోహరంగా నిర్వహించారు. పెద్ద పాండురంగస్వామి దేవాలయం వద్ద బంగారు రథం పై శివాజీ మహారాజ్ విగ్రహం ఉంచి పూలమాలలు పూజలు చేసి శోభయాత్ర ప్రారంభించారు. ఈ ర్యాలీ లో మహిళలు,బాలలతో వందలాది మంది పాల్గొన్నారు. కాషాయ పాతాకాలు చేతబూని కాషాయ టోపీలు, ఖండువా లు ధరించి శివాజీ మహారాజ్ కు జయ జయ నినాదాలు చేస్తూ నగర ప్రదక్షిణ గావించారు. శివాజీ విగ్రహం వద్ద చేరుకొని క్షిరాభిషేకం గావించి గజ మాలతో అలంకరణ చేసి పూజలు చేశారు. హిందూ ధర్మ రక్షణ కోసం, హిందూ సామ్రాజ్య స్థాపన కోసం అయన జీవితం అంకితమైనదని వక్తలు లాయర్ దత్తు, జోజోడే కుమార్, టి టి రమణ, కొనియాడారు. కుల పెద్దలు ముకుంద, రవీంద్రనాథ్,రాజశేఖర్ ఉత్తర్కర్ మంజు బీజేపీ నాయకులు అంజినాయక్, కుమార్స్వామి, ఆర్ఎస్ఎస్ పత్ర శ్రీనివాసులు , దేవాలయాల సేవకుడు నారాయణ మూర్తి పాల్గొన్నారు

**గుత్తి పట్టణంలో...** ఆర్.అండ్. బంగ్లా నుండి ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి సందర్భంగా స్కూ టర్లు ద్వారా ర్యాలీ నిర్వహించి అ నంతరం గుర్రం మీద శోభయాత్ర అ త్యంత నాయన మనోహరంగా నిర్వ హించారు.గాంధీ చౌక్ నుండి రాజీవ్ గాంధీ సర్కిల్ నుండి ఎన్టీఆర్ సర్కి ల్ వరుకు ర్యాలీ ద్వారా శివాజీ మ హారాజ్ ఫొటో ఉంచి పూలమాల లుతో శోభయాత్ర ప్రారంభించారు. ఈకార్యక్రమం ర్యాలీలో గుత్తి పట్టణ హైందవ ఐక్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు,బాలలతో వందలాది మంది పాల్గొన్నారు. కాషాయ పాతాకాలు చేతబూని కాషాయ టోపీలు, ఖండువా లు ధరించి శివాజీ మహారాజ్ కు జయ జయ నినాదాలు చేస్తూ నగర ప్రదక్షిణ గావించారు. హిందూ ధర్మ రక్షణ కోసం, హిందూ సామ్రాజ్య స్థాపన కోసం పాల్గొన్నారు.



# మున్సిపల్ పోరుకు రెడీ





**ఒంగోలు -సూర్య వాస్తవం :**

కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగుదేశం పార్టీ అధినేత స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్ రెండేళ్ల తర్వాత జరిగిన ఎన్నికల్లో విజయం సాధించడంతో ఇక కూటమి ప్రభుత్వం కూడా లోకల్ బాడీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను సాధించడంలో ఎలాంటి సందేహాలు లేవన్నది నాయకత్వానికి స్పష్టమయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుండటం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం అవుతుండటంతో ఇక కూటమి ప్రభుత్వం కూడా త్వరలోనే దీనికి సంబంధించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలున్నాయి. అయితే ఎండల సమయంలో కంటే తర్వాత పోలింగ్ జరపడం మంచిదని భావిస్తున్నట్లు సమాచారం. ఎండాకాలంలో ఓటింగ్ శాతం పై ప్రభావం పడుతుందని, అలాగే కొన్ని ఇబ్బందులు కూడా తలెత్తే అవకాశముందన్న అంచనాలో ఉంది.ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు దీనికి సంబంధించి సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. జులై నెలలో అయితే కొంత ఎండల తీవ్రత తగ్గుతుందని భావిస్తున్నారు. లేదంటే ఆగస్టులోనైనా స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి ప్రభుత్వం సిద్ధమన్న సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజాస్వామికంగా ఎన్నికలు జరగకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోనాల్సి వచ్చింది. మున్సిపాలిటీల్లోనూ తాడిపత్రి ఒక్కటే టీడీపీ గెలుచుకుంది. ఈ సారి అలా కాకుండా హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ ను స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించే ప్లాన్ ను చంద్రబాబు సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం ముందుగా జిల్లాల పర్యటనలు కూడా ఆయన చేస్తారని తెలిసింది.స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగితే తమ ఓటు బ్యాంకు మరింత బలపడుతుందని, రాజకీయంగా తమకు లాభిస్తుందని చంద్రబాబు అంచనా. అనేక మందికి పదవులు దక్కుతాయి. ఇప్పటి వరకూ పదవులు దక్కలేదని నిరాశలో ఉన్న వారి అసంతృప్తిని చల్లారవచ్చు. మరొకవైపు శాసనసభ్యులను కూడా యాక్టివ్ చేయవచ్చు. వారి నియోజకవర్గంలో జరిగే పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను గెలిపించుకునే బాధ్యత వారిపైనే ఉండటంతో వారు నిరంతరం ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. దానివల్ల ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత ఏర్పడుతుందని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే వీలయినంత త్వరగానే స్థానిక సంస్థలకు వెళ్లేలా చంద్రబాబు రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# బీజేపీ-బీఆర్ఎస్ పొత్తుపై పెరుగుతున్న చర్చ

**హైదరాబాద్ -సూర్య వాస్తవం :**

ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత విచిత్రమైన , ఆసక్తికరమైన సమీకరణాలకు తెరలేపాయి. సిద్ధాంతపరంగా బద్ధశత్రువులుగా కనిపించే పార్టీలు క్షేత్రస్థాయిలో అధికారం కోసం చేతులు కలపడం 'అవకాశవాద రాజకీయం'గా కనిపిస్తున్నా, దీని వెనుక లోతైన వ్యూహాలు దాగి ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల కంటే స్థానిక గెలుపు గుర్రాలే కీలకం కావడంతో చాలా చోట్ల అనూహ్య పొత్తులు కనిపించాయి. బీజేపీ-కాంగ్రెస్, బీఆర్ఎస్-బీజేపీ వంటి అసంభవమైన కలయికలు కొన్ని మున్సిపాలిటీల్లో అధికార పీఠాలను కైవసం చేసుకున్నాయి. నిజామాబాద్ వంటి చోట్ల కాంగ్రెస్-మజ్లిస్ జతకట్టడం గమనార్హం. రాష్ట్ర స్థాయిలో నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నా, స్థానిక కౌన్సిలర్లు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి పార్టీల మధ్య ఉన్న గీతలను చెరిపివేశారు.బీఆర్ఎస్ నేత హరీష్ రావు వంటి వారు ఇతర పార్టీల అనైతిక పొత్తులపై విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, స్థానిక సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల్లో నాయకత్వం వ్యక్తిగత ప్రాబల్యంపై ఆధారపడి ఉంటుంది. అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల నాటికి ఈ సమీకరణాలు మారిపోయి, మళ్ళీ ఆయా పార్టీల అధిష్టానాల ఆదేశాల మేరకు రాజకీయాలు నడుస్తాయి. అయితే ఈ మున్సిపల్ ఎన్నికలు పార్టీల మధ్య ఉన్న రాజకీయ అంటరానితనం పోయిందని స్పష్టం చేశాయి.ఈ ఎన్నికల తర్వాత అత్యంత ఆసక్తికరమైన చర్చ బీజేపీ - బీఆర్ఎస్ పొత్తు గురించి మొదలైంది. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలంటే ఈ రెండు పార్టీలు కలవడం ద్వారా ఓటు బ్యాంక్ ఏకీకరణ జరుగుతుందని ఒక వర్గం అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల ఓట్ షేర్ కలిపితే అది అధికార పార్టీ కంటే ఎక్కువగా ఉండటమే ఈ చర్చకు ప్రధాన కారణం. కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి ఈ రహస్య లేదా బహిరంగ పొత్తు మున్సిపల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లే అవకాశం ఉందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో, బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్టును కలిపితే బలమైన శక్తిగా ఎదగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, ఉమ్మడి శత్రువును ఓడించడానికి రెండు పార్టీలు చేతులు కలపడం వ్యూహాత్మకంగా లాభిస్తుంది. అయితే, ఈ పొత్తు వల్ల ఇరు పార్టీల సిద్ధాంతాలకు తూట్లు పొడిచినట్లవుతుందనే భయం కూడా నాయకత్వాల్లో ఉంది. మైనారిటీ ఓట్లు కోల్పోతామనే భయం బీఆర్ఎస్‌కు ఉంటే, హిందుత్వ ఓటు బ్యాంకులో చీలిక వస్తుందేమోనన్న ఆందోళన బీజేపీలో ఉంది.రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలు పొత్తుల గురించి ఆలోచన చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే, తెలంగాణలో కాంగ్రెస్‌ను ఒంటరిగా ఢీకొట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరమని ఈ మున్సిపల్ ఫలితాలు నిరూపించాయి. రాష్ట్ర స్థాయి రాజకీయం ఎప్పుడూ అధికారం చుట్టూనే తిరుగుతుంది కాబట్టి, భవిష్యత్తులో బీజేపీ-బీఆర్ఎస్ కలిసి పనిచేయడం అనేది అసాధ్యమేమీ కాదు. అయితే అది బహిరంగ పొత్తుగా ఉంటుందా లేదా లోపాయికారి ఒప్పందంగా ఉంటుందా అనేది కాలమే నిర్ణయించాలి.




## మూడుదారుల నిండా కదిలిన భక్తులతో

# ముగిసిన మూడు రోజుల గంగ జాతర

- అర్ధరాత్రి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన గంగమ్మ దేవత అమ్మవారు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చాందిని బండ్లు
- అలరించిన ఆర్కెస్ట్రా, జబ్బర్దస్త్
- బండలాగూడు పోటీలను తిలకించిడానికి ఆసక్తి చూపిన యువత, భక్తులు
- కోలాటం, చెక్కభజనలతో మార్మోగిన జాతర ప్రంగణం
- తిరుగుపయనమైన చాగలగుట్టపల్లె, గొల్లపల్లె అమ్మవార్లు





**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** రాయలసీమలోనే అతిపెద్ద జాతరగా పేరుగాంచిన లక్కిరెడ్డిపల్లి మండల ంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీ అనం తపురం గంగమ్మ దేవత జాతర రెండవ రోజు గురువారం మైలు తిరుణాలకు వచ్చే మూడు దారులు నిండుగా భక్తులు తరలిరావడంతో గంగమ్మ దేవత జాతర జన సంద్రంగా మారి మూడు రోజులకు ముగిసింది. అర్ధరాత్రి దాటాక తెల్లవారుజామున రెండు గంటల సమయంలో అమ్మవారు అశ్వ వాహనంపై ఆలయ ప్రాంగణం చుట్టూ ఉన్న రోడ్డుపై మంగళ వాయిద్యాలు నడుమ బాణాసంచా వేలుస్తూ భక్తుల కోలహాలతో అంగరంగ వైభవంగా దర్శనమిస్తూ మెరవనిగా ఈడిగపల్లెకు తిరుగు ప్రయా ణంలో తెల్లవారేసరికి అమ్మ వారు ఆలయానికి ప్రవేశించింది. పగటిపూట ఎండ తీవ్రత రోజురోజుకు పెరిగిపోతుండడంతో భక్తుల రద్దీ రాత్రి సమయంలో క్రమేపి పెరిగి అమ్మవారిని దర్శించు కోవ డానికి అన్ని క్యూలైన్లు నిండిపోయాయి. రెండు రోజులపాటు గంగమ్మ దేవత అమ్మవారి దర్శనం కొరకు భక్తులు లక్షలాదిగా తరలి రావడంతో జాతర భక్త జనంతో కిక్కిరిసిపోయింది. రాయలసీమ జిల్లాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి వందల సంఖ్యలో చాందిని బండ్లుతో పాటు కుంకుమ, ఎద్దుల బండ్లు జాతరకు చేరుకోవడంతో ట్రాఫిక్ సమస్య పోలీసులుకు సవాల్‌గా మారినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆధ్వర్యంలో రాయచోటి డిఎస్పి కృష్ణమోహన్ లక్కిరెడ్డిపల్లె సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్సై జి.శోభ లు జాతరకు కేటాయించిన ప్రత్యేక బందోబస్తుతో ఎక్కడి కక్కడ ట్రాఫిక్ సమస్య లేకుండా క్లియర్ చేయడం తో భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందుకు సాగారు. ఆలయం ప్రాంగణం పరిధిలోని ఆలయం చుట్టూ చాందిని బండ్లను మంగళ వాయిద్యాలు నడుమ వివిధ రకాల బాణాసంచా పేలుడు భక్తులను కనువిందు చేసేలా మిరమెట్లు కొలిపే కాంతులతో అలరింపజేసాయి. రెండు రోజులపాటు అమ్మవారికి మొక్కులు ఉన్న లక్షలాదిమంది భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. చాందిని బండ్ల ఎదుట ఏర్పాటు చేసిన కోలాటం, చెక్కభజన, భక్తులను ఎంతగానో అల్లరి ంపజేశాయి. జాతరలో ఏర్పాటుచేసిన జబర్దస్త్, రేలారే రేలా, డాన్స్ ప్రోగ్రాములతో యువత కేరింతలు కొడుతూ ఉత్సాహంగా సందడి చేశారు. గంగమ్మ ఆలయ చైర్మన్ సోడి



వెంకటేశ్వర్లు, ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు లు జాతరకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా హిందూ ధర్మ ప్రచారక్‌ల ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేసి అమ్మవారి దర్శనాన్ని కల్పిం చడానికి ఎక్కడికి అక్కడ వారిని ఏర్పాటు చేసుకుని సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చొరవ చూపారు.దాతలు సహకారం తో లక్కిరెడ్డిపల్లె జర్నలిస్టుల ఆధ్వర్యంలో భక్తులకు రెండు రోజులపాటు ఉచితంగా నీళ్లు,మజ్జిగ ప్యాకెట్లను అందజేయడం పట్ల ఆలయ కమిటీ నిర్వాహకులు సిబ్బంది వారిని అభినందించారు.

అమ్మవారి మూల విరాట్ తోపాటు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూలను తీసుకువచ్చి విశేషాలంక రణ చేయించిన ఉపాధ్యాయులు శివ శంకర్‌రెడ్డిని అలంకరణకు సహకరించిన దాత కడప సూర్య ఆసుపత్రి వైద్యులు దినకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తోపాటు రాయచోటి మురళి కోచింగ్ సెంటర్, నందిని కోచింగ్ సెంటర్ వారు జాతరకు వచ్చే భక్తులకు ఉచితంగా నీళ్లు మజ్జిగ ప్యాకెట్లు అందజేయ డానికి వారి వంతు ఆర్థిక సహాయాన్ని అందజేయడంతో వారిని ఆలయ కమిటీ ప్రత్యేకంగా అభినం దించారు. చాగల గుట్టపల్లె గంగమ్మ దేవత అమ్మ వారిని మధ్యాహ్నం రెండు గంటల సమయం నుండి ఆలయ ప్రాంగ ణంలోని ఆరుబయట మండపంలోకి తీసుకు రావడంతో అమ్మవారి దర్శనం కొరకు భక్తులు ఎగబడ్డారు. సాయంకాలం ఐదు గంటల సమయం నుండి సాంప్రదాయ బద్ధంగా చాగలగుట్టపల్లి గంగమ్మ దేవత అమ్మవారికి పూజారులైన ఆదిమూలం వం శీయులు చంద్ర, గంగయ్య, రెడ్డిశేఖర్ లు ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసి చాగలగుట్టపల్లె అమ్మవారి పూజారులైన పళ్ళు రఘునాథరెడ్డి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అమ్మవారి తెలుగు ప్రయాణంలో దారి పొడవున యధావిధిగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పిస్తూ పుట్టినిల్లు అయిన చాగుట్టగుట్టపల్లెకు గంగమ్మ దేవత ఉత్సవమూర్తిని చేర్చడంతో మైల తిరుణాల పరి సమాప్తం అయింది. గొల్లపల్లె గంగమ్మ దేవత అమ్మవారిని దాగిరి బుట్ట ఉంచి చీకటి సమయంలో నరకమార్గం ద్వారా పుట్టింటికి ఉత్సవమూర్తిని చేర్చడంతో జాతర ముగిసింది. మూడు రోజులపాటు జరిగిన గంగమ్మ జాతర కు అన్ని ఏర్పాట్లు చేసుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించేందుకు సహకరించిన మండలస్థాయి అధికారులకు, ఆలయ కమిటీ నిర్వాహకులకు, సహకరించిన దాతలకు పేరుపేరునా ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ సోడి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు మదన్ మోహన్‌లు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు.



### రాయలసీమ నలుమూలల నుండి బండలాగుడు పోటీలలో పాల్గొన్న పోటీ దారులు

జాతరను పురస్కరించుకొని బండలాగుడు పోటీలను ఆలయ కమిటీ నిర్వాహకులు నిర్వహించారు.మంత్రి సోదరుడు టిడిపి నాయకులు లక్ష్మీప్రసాద్ రెడ్డి పాల్గొని టిడిపి నాయకులు మదన్ మోహన్‌తో కలిసి బండలాగూడు పోటీలను ప్రారంభించారు. పోటీలలో గెలుపొందిన వారికి మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా మొదటి బహుమతి రూ. ఒక లక్ష, రెండవ బహుమతిగ రూ. 80 వేలు నగదును లక్ష్మీప్రసాద్ రెడ్డి అందజేశారు. బండలాగుడు పోటీలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో యువత స్థానికులు మహిళలు పోటీపడ్డారు.

## శ్రీచైతన్య పాఠశాలలో

# ఘనంగా ప్రీ ప్రైమరీ స్పోర్ట్స్ మీట్







**తిరుపతి - సూర్య వాస్తవం:** తిరుపతిలోని విద్యానగర్ కాలనీలోని తారకరామా నగర్ బ్రాంచ్ శ్రీ చైతన్య పాఠశా లలో డాక్టర్ బి. ఎస్.రావు ప్రీ ప్రైమరీ స్పోర్ట్స్ మీట్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ సుబ్బారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుండి ఆటలు పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థులు మానసికంగా, శారీర కంగా, చురుకుగా, దృఢంగా పెరుగుతారని చెప్పారు. ఇలాంటి ఆటల పోటీలు జరపడం చాలా ఆనందంగా ఉందని అనంతరం ఆటల పోటీలలో గెలిచిన విద్యార్థులకు ప్రశంసించి, బహుమతులు అందజేసి మిగిలిన విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్య క్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏ.జి.ఎం. డాక్టర్ సురేష్ పాల్గొని ముున్ముందు పిల్లల మనోవికాసానికి చాలా మంచి కార్యక్రమాలు ప్రవేశపెడతామని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న ఇతర ఉపాధ్యాయుల బృందం, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రంజాన్ మాసం షురూ

- రంజాన్ కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబైన మసీదులు
- ఉపవాస దీక్షలకు ఉపక్రమించిన ముస్లింలు

**కుప్పం –సూర్య వాస్తవం :** మహమ్మదీయ కాలమానం ప్రకారం హిజరీ1447 వ సంవత్సరపు రంజాన్ మాసం గురువారం ప్రారంభమైంది. నెలరోజుల పాటు ఉపాసదీక్షలను నిర్వహించేందుకు ముస్లింలు సన్నద్ధమయ్యారు. ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గంలో నాలుగు మండలాల మసీదులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేకువజామునే సెహరీ కార్యక్రమాన్ని పూర్తిచేసుకుని సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత ఇఫ్తార్ ద్వారా ఉపవాస దీక్షను విరమించనున్నారు. పవిత్ర రంజాన్ మాసంలో భక్తిశ్రద్ధలతో ఐదు పూటలా నమాజ్ తోపాటు తరావిహ్ నమాజులను చదివి అల్లాను దువా ద్వారా వేడుకోనున్నారు. మన్నించేవాడు మహి మాన్వితుడు అయిన అల్లాను ప్రార్థన ద్వారానే ప్రసన్నం చేసుకోవడానికి రంజాన్ మాసం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు ముస్లిం మేధావులు తెలిపారు. సమాజంలో ఈర్ష ద్వేషాలకు తావు లేకుండా మానవత్వానికి పెద్ద పీట వేస్తూ ప్రతి ఒక్కరికీ సహాయం చేసే గుణాన్ని కల్పించాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థించనున్నారు.

# చట్టాలపై అవగాహన సదస్సు




**పెళ్లకూరు –సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో ఈరోజు సాయంత్రం 4 గంటలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి నాయుడుపేట కోర్టు జడ్జి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొం దించడం, న్యాయ సంబంధిత హక్కులు, బాధ్యతలు వివరించడం, మహిళలు, విద్యార్థులు, సామాన్య ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు చట్టపరమైన పరిష్కారాలు తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా ఉచిత న్యాయ సహాయం, మహిళల రక్షణ చట్టాలు, బాలల హక్కులు, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై వివరణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొననున్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# అర్థం కానీ పవన్ వ్యూహం




**కాకినాడ –సూర్య వాస్తవం :**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చి తన గ్రాఫ్ తగ్గించుకుంటున్నట్లే కనపడుతుంది. ప్రశ్నించాలని రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఆయన ప్రశ్నించడమే మానేశారని సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం జగన్ ఓటమి కోసమే పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారా? లేక ఆయన ముఖ్యమంత్రి కావడానికి వచ్చారా? అని జనసైనికులే ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ పవన్ కల్యాణ్ పై ఇంతకు ముందు ఫైర్ కనిపించడం లేదని పోస్టు చేస్తున్న వీడియోలు ఇందుకు నిదర్శనం. పార్టీ నేతల నుంచి అభిమానుల వరకూ పవన్ కల్యాణ్ వ్యూహం ఎవరికీ అర్థం కాకుండా ఉంది. మరొకవైపు జగన్ ను ఓడించాలంటే మనం సీట్లు త్యాగం చేయాల్సిందేనని ఇప్పటి నుంచే చెబుతున్న హితోక్తులు కూడా వారిని కలవరపెడుతున్నాయి.జగన్ ను ఓడించడానికి అయితే రాజకీయాల్లోకి రావడం ఎందుకన్న ప్రశ్న కాపు సామాజికవర్గం నుంచి వస్తుంది. తొలిసారి కాపు సామాజికవర్గం నుంచి ఒక వ్యక్తి ముఖ్యమంత్రి అయితే చూడాలనుకున్నామని, కానీ పవన్ కల్యాణ్ మాటలను చూస్తుంటే ఆయన ఎప్పటికీ సీఎం పదవి కోరుకోవడం లేదని అర్థమవుతుందన్న అభిప్రాయం ఎక్కువ మందిలో వినిపిస్తుంది. మరొకవైపు కాపు సామాజికవర్గం సమస్యలపై కూడా ఆయన మాట్లాడకపోవడాన్ని వారు తప్పుపడుతున్నారు. కాపు రిజ్వేషన్లు అమలు చేయించడం, కాపు కార్పొరేషన్ కు నిధులు కేటాయించి పేదలైన కాపు కుటుంబాలను ఆదుకునే పనికి కూడా పవన్ కల్యాణ్ చేపట్టడం లేదన్న విమర్శలున్నాయిఈ నేపథ్యంలో క్రమేపీ పవన్ కల్యాణ్ గ్రాఫ్ ఇటు కాపు సామాజికవర్గంలోనూ అటు పార్టీ క్యాడర్ లోనూ పోతుంది. మరొకవైపు ఆయన సినీ అభిమానులు మాత్రం చెక్కు చెదరకుండా ఉన్నారు. నియోజకవర్గాల్లో తమకు విలువ లేకుండా చేస్తున్నారని చెప్పినా పవన్ వినిపించుకోవడం లేదని, తాము తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని జనసేన ద్వితీయ శ్రేణి నేతలు కూడా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జనసేనలో చాలా మంది సైలెంట్ అయ్యారు. పవన్ కల్యాణ్ వ్యూహం తమకు అర్థమయిందని, కేవలం జగన్ ఓడించడానికి మాత్రమే రాజకీయాల్లోకి వచ్చారని, తాను ముఖ్యమంత్రి కావడానికి రాలేదన్నది స్పష్టంగా కనిపిస్తుందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. కానీ పవన్ కల్యాణ్ ను అభిమానించే వారు మాత్రం ఆయన ప్రజ లకు మేలు చేయాలన్న ఉద్దేశ్యంతోనే అనుభజ్ఞుడైన చంద్రబాబుకు మద్దతిస్తున్నారని, అందుకే తగ్గుతున్నారని అంటున్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )